http://www.agnidharanews.com

# అగ్నిధార

బుధవారం 29 ఏప్రిల్ 2026

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## డిజిటల్ అరెస్టు మోసాలకు కేంద్రం చెక్?




- ఇకపై వాట్సాప్‌లో సిమ్ బైండింగ్, లోగో డిటెక్షన్ ఫీచర్లు!
- డిజిటల్ అరెస్టు మోసాలపై కేంద్రం ఉక్కుపాదం
- 9400 వాట్సాప్ ఖాతాలపై బ్యాన్
- సుప్రీంకోర్టుకు సమగ్ర నివేదిక

2లో

## తెలంగాణలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు

- రాబోయే నాలుగైదు రోజుల్లో వర్షాలు
- ఉత్తర తెలంగాణలో అధికమైన ఉష్ణోగ్రతలు
- 45 డిగ్రీలకుపైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో రాబోయే నాలుగైదు రోజుల్లో వర్షాలు
- ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో అధిక ఎండ తీవ్రత




హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇప్పటికే 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో రాగల నాలుగైదు రోజుల పాటు ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడంగడ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందంటున్న శ్రీనివాస్ రావుతో ఈటీవీ భారత్ ప్రతినిధి ముఖాముఖి. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా యని, ఆదిలాబాద్ ప్రాంతంలో గత రెండ్రోజుల నుంచి 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. 45.3 డిగ్రీలు దాటి వేడిగాలుల స్థాయిని మించి రికార్డు అవడంతో నిన్నటి - మిగతా3లో



## సిక్కిం అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంది

- ఆ విధానాలకు కేంద్రం కట్టుబడి ఉంది
- సిక్కిం పర్యటనలో ప్రధాని మోదీ
- రాష్ట్ర ఆవిర్భావ ముగింపు వేడుకల్లో ప్రసంగించిన మోదీ
- 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని సిక్కిం అద్భుతంగా ప్రతిబింబిస్తోంది
- కాంగ్రెస్‌పై విమర్శలు

2

## నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీ

- ఆదర్శ నగరాలతో పోటీపడేలా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలి
- ప్రజాప్రతినిధులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుంది
- జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చర్యలు



హైదరాబాద్

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అక్కడి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగితే ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల ప్రజాప్రతినిధులకు పాస్ పంపాలని పోలీసులకు సూచించారు. కొంతమంది తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారని, ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి - మిగతా3లో

## రేవంత్.. వారితో ఫోన్లు హ్యాక్ చేయిస్తున్నావా?



- 'రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు
- ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారు
- మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారు
- ప్రశ్నించే గొంతులపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతుంది.

హైదరాబాద్

తెలంగాణలో ప్రశ్నించే గొంతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు మాజీ మంత్రి హరీష్ రావు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూర్ఖత్వం హిట్లర్‌ను మించిపోయిందని ఎద్దేవా చేశారు. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్లను హ్యాక్ చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారు. ప్రశ్నించే - మిగతా3లో

## ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు

- బంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారన్న ఊహాగానాలను తోసిపుచ్చిన కేంద్రం
- "పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు"




2

## రాజకీయాల కోసమే రిజర్వేషన్ బిల్లు

- ఆ పాపానికి మోదీ ప్రాయశ్చిత్తం చేసుకునే సమయం వచ్చింది: కాంగ్రెస్
- లోక్‌సభలో ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- ఆల్ పార్టీ సమావేశం నిర్వహించాలని కేంద్రాన్ని కోరిన జైరాం రమేశ్

2





## తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ నియామకం

- డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న శివధర్‌రెడ్డి
- 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్
- సినిమా పైరసీ ముఠాను పట్టుకున్న సీవీ ఆనంద్
- రాష్ట్రానికి మూడో పూర్తి కాలపు డీజీపీ

2

## తెలంగాణ సెంటిమెంట్‌పై పోరు



- కవిత ఓటు..ఎవరికి చేటు
- మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు
- ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి
- ఈ క్రమంలో కవిత పెట్టిన పార్టీ ఎవరిని దెబ్బతీస్తుంది అన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది
- కవిత తన పార్టీకి 'టీఆర్ఎస్' అని పేరు పెట్టడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది
- కవిత తన తొలి ప్రసంగంలో కాంగ్రెస్, బీజేపీలను పక్కనబెట్టి, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని టార్గెట్ చేయడం గమనార్హం

2

హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన ఆవిర్భావ సభలో ఆమె పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించి, రానున్న రాజకీయాల్లో తాను స్వతంత్ర శక్తిగా ఎదగనున్నట్లు సంకేతాలిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఈ క్రమంలో కవిత పెట్టిన పార్టీ ఎవరిని దెబ్బతీస్తుంది అన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది. కవిత తన పార్టీకి 'టీఆర్ఎస్' అని పేరు పెట్టడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ఒకప్పుడు కేసీఆర్ నేతృత్వంలోని ఉద్యమ పార్టీ 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సమితి) పేరును బీఆర్ఎస్‌గా మార్చుకున్న - మిగతా3లో



## మే రెండో వారంలో భారత్‌కు ఎస్-400 గగనతల వ్యవస్థలు

- పాక్ సరిహద్దుల్లోనే మెహరింపు
- పాకిస్థాన్ నుంచి వచ్చే ముప్పును నిర్మూలించేందుకు రాజస్థాన్‌లోని సరిహద్దు వెంబడి వీటిని మోహరించనున్నట్లు వెల్లడి
- వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఊపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించింది లేదు.

2

# సిక్కిం అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంది



సిక్కిం పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. సిక్కిం అభివృద్ధిని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అడ్డుకున్నాయని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి మళ్లీ పుంజుకుందని అన్నారు. మతం, రాజకీయాల పేరుతో దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో హిమాలయ రాష్ట్రమైన సిక్కిం జాతి ఐక్యతను సగర్వంగా చాటిచెబుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'ఏక్ భారత్ – శ్రేష్ఠ్ భారత్' స్ఫూర్తిని సిక్కిం అద్భుతంగా ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. సిక్కిం రాష్ట్ర ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు సాధిస్తున్న అభివృద్ధి చాలా ముందే సాధ్యమయ్యేది. కానీ వరుసగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు సిక్కిం అభివృద్ధిని అడ్డుకున్నాయి. అభివృద్ధి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశాయి. సివోక్–రాంగ్పో రైల్వే ప్రాజెక్టు 2008–09లోనే ఆమోదం లభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదు. కేవలం పేపర్ మీదనే పనులు జరిగాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జోరందుకుంది. తొలిసారిగా సిక్కింకు రైలు రాబోతోంది' అని ప్రధాని మోదీ అన్నారు.

**ఈశాన్య రాష్ట్రాలు దేశానికే అష్టలక్ష్మి : మోదీ**

సిక్కిం, ఈశాన్య ప్రాంతం మన దేశానికి ముఖ్య భాగాలే కాదని, అవి అష్టలక్ష్మి లాంటివి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యాక్ట్ ఈస్ట్ పాలసీతో పాటు, ఈశాన్య ప్రాంత అభివృద్ధికి యాక్ట్ ఫాస్ట్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వివిధ రంగాలకు చెందిన 30కి పైగా ప్రాజెక్టులను ప్రారంభించినట్లు తెలిపారు. సిక్కింలో కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందనట్లు చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన ద్వారా సిక్కింకు దేశంలోని ఇతర ప్రాంతాలతో మరింత సులభమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాలన్నీ భవిష్యత్ వృద్ధికి, సుస్థిర అభివృద్ధికి కేంద్రాలుగా మారనున్నాయని ప్రధాని ఉద్ఘాటించారు.

**'పర్యాటక రంగమే సిక్కిం బలం'**

సిక్కిం ఆర్థిక వృద్ధికి పర్యాటక రంగమే కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'దేశ మొత్తం విస్తీర్ణంలో 1 శాతం కూడా లేని సిక్కింలో, 25 శాతం వృక్ష జాతులు ఉన్నాయి. 500కు పైగా పక్షుల జాతులు, 700కు పైగా సీతాకోకచిలుకలు, అరణ్య సంపద, అలాగే కాంచెంజుంగా పర్వత మహిమ సిక్కింను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ప్రకృతి సౌందర్యం వల్ల పర్యటకులు మళ్లీ మళ్లీ రావాలనుకునే రాష్ట్రంగా సిక్కిం నిలుస్తోంది. రాష్ట్రంలోని రోడ్ల పరిశుభ్రత, గాలి స్వచ్ఛత చూస్తుంటే, ఇక్కడి ప్రజలు ప్రకృతి పరిరక్షణకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు అని స్పష్టమవుతోంది. నేను ఆర్కిడేరియంను సందర్శించా. అక్కడ చాలా సమయం గడిపాను. ప్రకృతి ప్రేమికులైన పర్యటకులకు నేను చెప్పేది ఆర్కిడ్లను చూడకపోతే, వారు ఏమీ చూడనట్లే. ఈ సంవత్సరం సిక్కిం అన్ని పర్యాటక రికార్డులను బద్దలు కొడుతుందని నేను విశ్వసిస్తున్నా' అని ప్రధాని మోదీ తెలిపారు.

**పలు కీలక ప్రాజెక్టులు ప్రారంభం**

సిక్కిం రాష్ట్ర స్థాపన వేడుకల ముగింపు సందర్భంగా రూ.4వేల కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా భారత పటం ఆకారంలో పలువురు కళాకారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. సిక్కింలో మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ విద్య, విద్యుత్, పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయం వంటి విస్తృత రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులున్నాయి.

# డిజిటల్ అరెస్టు మోసాలకు కేంద్రం చెక్?



దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు కేంద్రం నడుంబిగించింది. ఇందుకోసం పలు నిబంధనలు ప్రతిపాదించి, తాజాగా దానికి సంబంధించిన ఓ నివేదికను అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. డిజిటల్ అరెస్టు మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత మొదలైన చర్యలు చేపట్టనున్నట్లు అందులో పేర్కొంది.

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల ముప్పును ఎదుర్కొనేందుకు టెలికాం నియంత్రణ సంస్థలు, సర్వీస్ ప్రొవైడర్లు, ఆర్‌బీఐ, టెక్ సంస్థలు, సీబీఐ సహకారంతో పలు చర్యలు చేపట్టినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇందులో భాగంగా డిజిటల్ అరెస్టు మోసాలకు, నేరాలకు పాల్పడుతున్న 9,400 వాట్సాప్ ఖాతాలను నిషేధించినట్లు వెల్లడించింది. వాస్తవానికి దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు కేసులను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఫిబ్రవరి 9న ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (14సీ) ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.

**సుమోటోగా విచారణ**

సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం డిజిటల్ అరెస్టులతో సహా ఆన్‌లైన్ మోసాలపై సుమోటోగా విచారణ చేపట్టింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో నష్టపోయిన వారికి తగు పరిహారం అందించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని, ఇందుకోసం ఆర్‌బీఐ, టెలికమ్యునికేషన్ విభాగం, ఇతర సంస్థలను సంయుక్తంగా సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే అటార్నీ జనరల్ ఆర్?.వెంకటరమణి ప్రభుత్వం తరఫున తాజా నివేదికను సుప్రీం కోర్టు ముందు దాఖలు చేశారు. ఇందులో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వాట్సాప్‌పై తీసుకున్న చర్యలను వివరించారు.

"ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డీవోటీ ఆదేశాల మేరకు, వాట్సాప్? డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ స్కామ్‌లపై అత్యంత కఠినమైన పద్ధతులను ఉపయోగించి దర్యాప్తు నిర్వహించింది. ముందుగా 'సీడ్ సిగ్నల్స్ గుర్తించడం ∩ నెట్‌వర్క్‌లను మ్యాప్ చేయడం ∩ మొత్తం నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవడం ∩ ఆటోమేటెడ్ డిఫెన్స్ నిర్మించడం' లాంటి చర్యలు తీసుకుంది. దీని ద్వారా డిజిటల్ అరెస్టులతో ప్రమేయం ఉన్న 9400 ఖాతాలను బ్యాన్ చేసింది" అని సదరు నివేదికలో పేర్కొన్నారు.

**వినియోగదారుల రక్షణ కోసం!**

నివేదిక ప్రకారం, "వినియోగదారుల రక్షణ కోసం వాట్సాప్ పలు ఫీచర్స్‌ను తీసుకొచ్చింది. ముఖ్యంగా ప్రొఫైల్ పిక్చర్‌లలో అధికారిక పోలీసు లేదా ప్రభుత్వ చిహ్నాలను ఉపయోగిస్తున్న ఖాతాలను తొలగించే లోగో డిటెక్షన్ వ్యవస్థలు తీసుకొచ్చింది. కొత్తగా క్రియేట్ చేసిన వాట్సాప్ అకౌంట్ల నుంచి కాల్ వస్తే, యూజర్లను హెచ్చరించే ఫీచర్‌ను వాట్సాప్ తీసుకురానుంది. అలాగే అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వారి ప్రొఫైల్ ఫొటోలు కనిపించకుండా ఆటోమేటిక్‌గా హైడ్ చేసే ప్రక్రియను త్వరలో ప్రవేశపెట్టనుంది. అలాగే ఫోన్‌లో కేవైసీ పూర్తయిన సిమ్ కార్డు ఉంటేనే వాట్సాప్ పనిచేసేలా "సిమ్ బైండింగ్" విధానాన్ని 4 నుంచి 6 నెలల్లో అమలు చేస్తామని వాట్సాప్ తెలిపింది. ఇక అనుమానాస్పద, మోసపూరిత సిమ్ కార్డులను గుర్తించిన 2 నుంచి 3 గంటల్లోనే వాటిని బ్లాక్ చేసేలా చేయడానికి కట్టుబడి ఉన్నట్లు డీవోటీ పేర్కొంది. సిమ్ కార్డుల జారీలో పారదర్శకత కోసం 'బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ సిస్టమ్'ను 2026 డిసెంబర్ నాటికి అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రూ.10 కోట్లకు పైగా నష్టం వాటిల్లిన డిజిటల్ అరెస్టు కేసులను సీబీఐ నేరుగా విచారణకు స్వీకరించనుంది. ప్రస్తుతం గుజరాత్, దిల్లీకి చెందిన 3 ప్రధాన కేసులను సీబీఐ రీ–రిజిస్టర్ చేసింది. ఇందులో దిల్లీకి చెందిన ఓ బాధితుడు ఏకంగా రూ.22.92 కోట్లు కోల్పోవడం గమనార్హం. మనీ మ్యూల్ (డబ్బు మళ్లింపు) కార్యకలాపాలను అరికట్టేందుకు అనుమానాస్పద లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసేలా ఆర్‌బీఐ ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ని సిద్ధం చేసింది. ఈ నివేదికను రికార్డుల్లోకి తీసుకోవాలని హోంశాఖ సుప్రీంకోర్టును కోరింది. అంతేకాదు ప్రభుత్వం ఈ నివేదికలో, టెలికాం నిబంధనలను కఠినతరం చేయాలని, వాట్సాప్ వంటి సంస్థలు తమ హామీలను సకాలంలో నెరవేర్చాలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది.

# రాజకీయాల కోసమే రిజర్వేషన్ బిల్లు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. మహిళలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించిన పాపానికి ఇప్పుడు ప్రధాని మోదీ ఇప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకునే సమయం వచ్చిందని పేర్కంది. లోక్‌సభలో ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేసే విధానంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను ఆమోదించాలనే మోదీ కుటిల ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు ఐక్యత వల్ల ఘోరంగా విఫలమైంది. ప్రతిపక్షాలు డిమాండ్? చేస్తున్న పనిని ప్రధాని మోదీ చేయాల్సి సమయం ఆసన్నమైంది. నారీ శక్తి వందన్ అధినియమ్ 2023 అమలుపై స్పష్టత తీసుకురావాలి. ఈ చట్టం ఏప్రిల్ 16, 2026 రాత్రి ఆలస్యంగా నోటిఫై చేశారు. 2029 నుంచి ప్రస్తుత లోక్‌సభ 543 సీట్లతోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యం, అవసరం, తప్పనిసరి' అని జైరాం రమేశ్ తెలిపారు.

**'మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం కాదు'**

ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం కాదని జైరాం రమేశ్ ఆరోపించారు. డిలిమిటేషన్ ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రధాని రాజకీయ రక్షణ కోసం డిలిమిటేషన్‌ను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించారని ఆరోపించారు. మహిళలను రాజకీయ అజెండా కోసం వినియోగించిన తప్పును సరిదిద్దుకుని, వారికి న్యాయం చేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుత లోక్‌సభ సీట్లలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి వర్షాకల సమావేశంలో లేదా అంతకంటే ముందే బిల్లు తీసుకురావాలని కోరారు.

**రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి**

మహిళా రిజర్వేషన్ అమలు కోసం కేంద్రం తీసుకువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఇటీవల లోక్‌సభలో ఓడిపోయింది. 28 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. 2/3 మెజారిటీ కోసం 352 ఓట్లు అవసరమయ్యాయి. ఈ బిల్లులో భాగంగా లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కి పెంచి, 2011 జనగణన ఆధారంగా డిలిమిటేషన్ చేసి, 2029 ఎన్నికలకల్లా మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలలో కూడా సీట్ల సంఖ్య పెంచి 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని భావించింది.

**బాక్సైట్ తవ్వకాల విషయంలో కేంద్రంపై విమర్శలు**

మరోవైపు, ఒడిశాలో బాక్సైట్ తవ్వకాల ప్రాజెక్టు గురించి జరుగుతున్న గిరిజనుల నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని జైరాం రమేశ్ తీవ్రంగా విమర్శించారు. రాయగడ, కళహాండీ జిల్లాల్లోని సిజిమాలి ప్రాంతంలో చేపడుతున్న తవ్వకాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చట్ట విరుద్ధమని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులు పెసా, అటవీ హక్కుల చట్టాల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభావిత గ్రామ సభలు, స్థానిక సమాజాలకు ఉన్న హక్కులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టారని ఆరోపించారు. సిజిమాలి ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యావరణంపై భారీ ప్రభావం చూపే తవ్వకాల ప్రాజెక్టులను చట్టపరమైన రక్షణలను పక్కనబెట్టి బలవంతంగా అమలు చేయడం ఒడిశాకు కొత్త విషయం కాదని అన్నారు. ఇదే పరిస్థితి మళ్లీ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. గిరిజనులపై, ముఖ్యంగా మహిళలపై పోలీసులు అధిక బలప్రయోగం చేశారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఎస్‌సీ/ఎస్‌టీ చట్టం–1989 ఉల్లంఘనకు దారితీస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా గిరిజన సమాజానికి చెందిన రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని తెలిపారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి కూడా ఒడిశాకు చెందినవారేనని, ఆయన స్పందించి వెంటనే స్వతంత్ర దర్యాప్తు ఆదేశించాలని కోరారు.

## ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు




ఏప్రిల్ 29న బంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారన్న ఊహాగానాలను కేంద్రం తోసిపుచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రణాళికలు ప్రభుత్వానికి లేవని కేంద్ర ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. "పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు" అని పశ్చిమాసియా పరిణామాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. బుధవారం బంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత రిటైల్ ఇంధన ధరలను పెంచుతారా అన్న ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల కారణంగా గత రెండు నెలల్లో ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో వరుసగా నాలుగో ఏడాది కూడా స్థిరంగా ఉన్నాయి. ముడిసరుకుల ధరలకు, పెట్రోల్? పంపు ధరలకు మధ్య పెరుగుతున్న వ్యత్యాసం ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు భారీ నష్టాలను మిగిల్చింది. కొన్ని అంచనాల ప్రకారం రోజువారీ నష్టం సుమారు రూ. 2,400 కోట్లుగా ఉంది. అయితే, బుధవారం తమిళనాడు, బంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో రాజకీయంగా ఉత్కంఠభరితమైన అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ధరలు తక్షణమే పెరుగుతాయన్న ఊహాగానాలు తలెత్తాయి.

## మే రెండో వారంలో భారత్‌కు ఎస్-400 గగనతల వ్యవస్థలు

రష్యా నుంచి నాల్గో విడత అత్యాధునిక ఎస్–400 గగనతల వ్యవస్థలు భారత్‌కు చేరేందుకు సిద్ధమయ్యాయి. మే రెండో వారంలో భారత్‌కు రష్యా వీటిని డెలివరీ చేయనున్నట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. గతవారమే రష్యాలో షిప్పింగ్‌కు సిద్ధంగా ఉన్న ఎస్–400 వ్యవస్థలను భారత వాయుసేన ఉన్నతాధికారులు తనిఖీ చేశారని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నుంచి వచ్చే ముప్పును నిర్మూలించేందుకు రాజస్థాన్‌లోని సరిహద్దు వెంబడి వీటిని మోహరించనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ నుంచి వచ్చిన ప్రతీ ముప్పును ఈ ఎస్–400లోని క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో అడ్డుకున్నాయి. అందుకు గుర్తుగా ఆపరేషన్ సిందూర్ వార్షికోత్సవం రోజునే వీటిని భారత్‌కు డెలివరీ చేసేలా అధికారులు ప్రణాళికలు రచించారు.

**మరో ఐదు ఎస్–400లను కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం**

రష్యాతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఐదో, చివరి విడత ఎస్–400లు నవంబర్‌లో భారత్‌కు చేరనున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ మొత్తం 11 దీర్ఘశ్రేణి ఎస్–400 క్షిపణులను ప్రయోగించి, పాక్ యుద్ధవిమానాలు, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, రవాణా విమానాలతో సహా పలు వైమానిక ముప్పులను నిర్వీర్యం చేసినట్లు సమాచారం. అప్పుడు ఇవి ప్రదర్శించిన సామర్థ్యాన్ని చూసిన తర్వాత మరో ఐదు ఎస్–400లను కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వేళ ఎస్–400 అద్భుతంగా పనిచేసింది. ఓ విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల అవతల నుంచే ధ్వంసం చేసినట్లు అధికారులు చెప్పారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఊపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించింది లేదు. అంతకు ముందు కూల్చిన లక్ష్యాల్లో 200 కిలోమీటర్ల దూరమే ఇప్పటి వరకు అత్యధికంగా ఉంది. కానీ, ఎస్–400 గగనతల వ్యవస్థలో వాడే నాలుగు రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజి 400 కిలోమీటర్లు దూరం వెళ్లనుంది. దీనిని ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయుసేన పూర్తిస్థాయిలో వినియోగించింది. ఈ వ్యవస్థకు భయపడి పాక్ తమ ఎఫ్–16 ఫైటర్ జెట్లు, చైనా నుంచి కొనుగోలు చేసిన విమానాలను సుదూర ప్రదేశాలకు తరలించిందంటేనే దీని ప్రభావం ఏ మేరకు ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం వాయుసేన ఆధ్వర్యంలో పాక్, చైనా సరిహద్దుల్లో 1.5 రెజిమెంట్ల చొప్పున మోహరించారు.

ఇదిలా ఉండగా, ఐదు ఎస్–400 ట్రయంఫ్ రెజిమెంట్ల విషయంలో భారత్ 2018 అక్టోబర్? 5న రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.40వేల కోట్లు. 'కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్' (జాూాజూూ) నిబంధనల కింద ఈ ఒప్పందంతో ముందుకు సాగితే అమెరికా ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా హెచ్చరించినప్పటికీ, భారత్ ఏడేళ్ల క్రితమే ూ–400 క్షిపణుల సేకరణ ఒప్పందంపై సంతకం చేసింది. వాస్తవానికి 2024 తొలి అర్ధభాగంలోనే మొత్తం ఐదు ఆర్డర్లను అందజేయాల్సింది. కానీ, ఇప్పటి వరకు మూడు చేరుకోగా, నాలుగో ఆర్డర్? వచ్చే నెలలో, చివరిది నవంబర్? నాటికి ఇవ్వనున్నారు.

**అనేక రక్షణ ప్రాజెక్టుల్లో సహకారం**

సుదీర్ఘకాలంగా వ్యూహాత్మక భాగస్వాములైన భారత్– రష్యాలు అనేక రక్షణ ప్రాజెక్టుల్లో పరస్పరం సహకారం చేసుకుంటున్నాయి. రష్యాకు చెందిన సుఖోయ్–30 ఎంకేఐ, టీ–90 ట్యాంక్‌లు భారత్‌లోనే లైసెన్స్‌డ్ ఉత్పత్తి చేస్తున్నారు. మాస్కో నుంచే మిగ్–29 ఫైటర్ జెట్లు, కమోవ్ హెలీకాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రమాదిత్యను భారత్? తీసుకుంది. ఏకే–203 రైఫిల్స్, బ్రహ్మోస్ క్షిపణులను భారత్‌లోనే తయారు చేస్తున్నారు.

## యూట్యూబ్ చూసి యువకుడు ఆవిష్కరణ

విద్యుత్ కోతలు అనేవి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎప్పటికీ తీరని సమస్యలు. ముఖ్యంగా ఎడారి, సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఇబ్బంది మరింత తీవ్రంగా ఉంటుంది. అందుకే రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు తన వినూత్న ఆవిష్కరణతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ముందడుగు వేశాడు. చిన్న ఆకారంలో, ఎక్కడైనా అమర్చుకునేందుకు వీలుగా ఉండేలా ఓ 'పోర్టబుల్ విండ్ టర్బైన్'ను రూపొందించాడు. ఇప్పుడు అతడి ఆవిష్కరణ దేశానికే కాకుండా విదేశాల్లోనూ ప్రశంసలు అందుకుంటోంది. బాడ్‌మేర్ జిల్లా సాంఖలీ గ్రామానికి చెందిన దూంగరసింహ్? సోఢా, 2006లో వచ్చిన వరదల సమయంలో విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దగ్గరగా చూశారు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని సంకల్పించారు. దాంతో అతడు ఓ వినూత్న పరికరాన్ని రూపొందించారు. ఈ పోర్టబుల్ విండ్ టర్బైన్‌ను ఇంటి పైకప్పు, బాల్కనీ లేదా ఎక్కడైనా సులభంగా అమర్చుకునేలా తయారు చేశారు. ఒక కిలోవాట్ సామర్థ్యం గల ఈ టర్బైన్, గాలి బాగా వీస్తే రోజుకు 10 నుంచి 20 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేయగలదని ఆయన తెలిపారు. ఈ టర్బైన్ రోజుకు 10 గంటలు పనిచేస్తే నెలకు సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుందని దూంగరసింహ్? అన్నారు. ఈ పోర్టబుల్ విండ్ టర్బైన్ ధర రూ.50 వేల నుంచి ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. దీంతో సామాన్యులు, రైతులు, గ్రామీణ కుటుంబాలు సైతం దీన్ని సులభంగా కొనుగోలు చేసి వినియోగించుకోవచ్చని అన్నారు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే దాదాపు 20 సంవత్సరాల పాటు విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. దూంగరసింహ్ పెద్దగా చదువుకోకపోయినా, తన సంకల్పంతోనే ఈ విజయాన్ని సాధించారని ఆయన అన్నారు. యూట్యూబ్ వీడియోలు, విశ్వవిద్యాలయాల పరిశోధన పత్రాలు, స్వీయ ప్రయోగాల ద్వారా ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రారంభంలో అల్యూమినియం షీట్లు, పాత ఫ్యాన్ బ్లేడ్‌లతో ఓ నమూనాను రూపొందించారని చెప్పారు.

# తెలంగాణ సెంటిమెంట్‌పై పోరు

-మొదటిపేజీ తరువాయి

తర్వాత ఏర్పడిన సెంటిమెంట్ శూన్యాన్ని భర్తీ చేసేందుకు కవిత ఈ వ్యూహాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. 'బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పాత తరం ఉద్యమకారులను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్‌కు అతిపెద్ద ముప్పుగా మారనుందని, పార్టీ ఓటు బ్యాంకును, ముఖ్యంగా కేడర్‌ను కవిత వైపు మళ్లించే అవకాశం ఉందని స్పష్టమవుతోంది కవిత తన తొలి ప్రసంగంలో కాంగ్రెస్, బీజేపీలను పక్కనబెట్టి, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని టార్గెట్ చేయడం గమనార్హం. 'కేసీఆర్ ఇప్పుడు మారు మనిషి అయ్యారు, గుంట నక్కల చేతిలో బందీ అయ్యారు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబ కలహాల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఆస్తుల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలే ఈ పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలను, కేటీఆర్, హరీష్‌రావుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శ్రేణులను తనవైపు తిప్పుకోవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో తనదైన ముద్ర ఉన్న కవిత, క్షేత్రస్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నారు. కేసీఆర్ ఇటీవల మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ కార్డును తెరపైకి తెచ్చినప్పటికీ, కవిత అదే సెంటిమెంట్‌ను 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో వాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు షర్మిల రాజకీయ ప్రవేశం జరిగినప్పటికీ ఆమెకు లభించిన స్పందన కంటే, కవితకున్న సామాజిక గుర్తింపు మరియు తెలంగాణ ఉద్యమకారులతో ఉన్న అనుబంధం కారణంగా, బీఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆమె చీల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కవిత ఎత్తుగడలు కేసీఆర్ కుటుంబంలోనే కాకుండా, పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.కేసీఆర్ ఇటీవల జీవన్‌రెడ్డి చేరిక సభలో తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. కొత్త ఎత్తులు పనిచేయకపోవడంతో పాత సెంటిమెంటును రగిలించే యత్నం చేశాడు. ఇప్పుడు కవిత కూడా తెలంగాణ సెంటిమెంటును పండిచంఆలనుకుంటుంది. దీంతో బీఆర్ఎస్‌కు ఇది ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. కవితకు తెలంగాణలో మంచి పట్టు ఉంది. ప్రజలను ప్రభావితం చేయగలదు. దీంతో కవిత పార్టీతో ముప్పు ఎదుర్కొనేది బీఆర్ఎస్ పార్టీనే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**అనుకున్నంతా ఈజీ కాదు...**

ఒక రాజకీయ పార్టీని నడపాలంటే ఒకప్పుడు ఆర్థిక వనరులు అంతగా ఉండాల్సిన అవసరం ఉండదు కాదు. ఎందుకంటే కార్యకర్తలు పార్టీకి పని చేయడాన్ని ఒక గౌరవంగా భావించేవారు. రాజకీయ నాయకులు కూడా ఇప్పటి మాదిరిగా లేరు కాబట్టి.. అప్పుడు అంతగా ఖర్చు ఉండేది కాదు. పైగా దోచుకోవడం, దాచుకోవడం అనే సిద్ధాంతాన్ని నేతలు పాటించేవారు కాదు. దీనివల్ల రాజకీయాలు అంత ఖరీదుగా ఉండేవి కాదు.. మీడియా కూడా న్యూట్రల్ గా ఉండేది. అందువల్ల నాటి రోజుల్లో రాజకీయ పార్టీని నిర్వహించడానికి నేతలకు భారీగా డబ్బు అవసరం పడేది కాదు.ఇప్పటి రోజులు వేరు. ప్రతిదీ ఖరీదుగా మారిపోయింది. పార్టీ కార్యాలయాన్ని నిర్వహించాలి. జిల్లాలో కార్యాలయాలను నిర్వహించాలి. విలేకరుల సమావేశం పెడితే కవర్లు ఇవ్వాలి. సోషల్ మీడియాను రన్ చేయాలి. ప్రత్యర్థి పార్టీల నేతల మీద నిత్యం బురద చల్లుతూనే ఉండాలి. లీగల్ టీం బలోపేతంగా ఉండాలి. అన్నింటికీ మించి దండిగా సంపాదించుకోవాలి. తరాలు తిని కూర్చున్నా కూడా తగ్గని ఆస్తులను వెనకేసుకోవాలి. ఇదంతా జరగాలంటే దోపిడీ చేయాలి. దుర్మార్గాలకు పాల్పడాలి. అక్రమాలకు శ్రీకారం చుట్టాలి. అందువల్లే రాజకీయ నాయకులు అంటే ప్రజల్లో చులకన భావం.. మేధావుల్లో హేయమైన భావం.తెలంగాణ రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు అయింది. ఈ పార్టీని ఏర్పాటు చేసింది తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత. తన పార్టీ పేరును ఆమె టిఆర్ఎస్ గా ప్రకటించారు. వాస్తవానికి ఒక మహిళ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం మన దేశంలో కొత్తగాక పోయినప్పటికీ.. మఘలో పుట్టి పుబలో మునిగిపోయిన మాదిరిగా కాకుండా.. రాజకీయ పార్టీ సుదీర్ఘకాలం పనిచేయాలంటే కచ్చితంగా ఆర్థిక వనరులు ఉండాల్సిందే. కవిత పార్టీ ఏర్పాటు చేశారు కాబట్టి ఆమె దానిని కొనసాగించగలుగుతారా.. ఆమె దగ్గర ఉన్న ఆర్థిక స్థాయి ఎంత.. తెర వెనుక ఏవైనా భారీ అండదండలు ఉన్నాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా వ్యక్తం అవుతున్నాయి.రాజకీయ పార్టీని ఏర్పాటుచేసిన కవిత ఆర్థిక పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే.. 2021లో ఎమ్మెల్సీ ఎలక్షన్ అఫిడబిట్ లో ఆమె తన పేరు మీద 39.79 కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. 21.62 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించారు. 1.9 కిలోల బంగారం, 11.2 కిలోల వెండి ఉన్నట్టు వెల్లడించారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 6.19 కోట్ల ఆస్తులు.. 2019 ఎన్నికల్లో 17.9 3 కోట్ల ఆస్తులు.. 2020లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 27.64 కోట్ల ఆస్తులు ఉన్నట్టు కవిత వెల్లడించారు. అయితే ఈ స్థాయి ఆస్తులతో రాజకీయ పార్టీని ఎలా నడుపుతారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఆమె పార్టీలో ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు కనిపించడం లేదు. ఆమె చెప్పినట్టుగా గొప్ప గొప్ప నాయకులు పార్టీలో చేరలేదు. ఇప్పటికైతే పార్టీలో పెట్టుబడి పెట్టాల్సింది.. నిర్వహణ ఖర్చు చూసుకోవాల్సింది మొత్తం కవితనే. పైగా ఆర్థికంగా కవిత బలంగానే ఉన్నప్పటికీ.. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని ఆమె ఏక కాలంలో విమర్శిస్తున్నారు. అలాంటప్పుడు ఆమెకు ఆర్థికంగా సహాయం చేయడానికి ఎవరు ముందుకు వస్తారు.. ఒకవేళ వచ్చినా ప్రభుత్వం ఒత్తిడికి వారు తట్టుకుంటారా.. ప్రతిపక్షం దూకుడు ముందు నిలబడతారా.. వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటేనే కవితకు, ఆమె రాజకీయ పార్టీకి మనగడం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు."పార్టీ ఆవిర్భావ సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వంటకాలు మొత్తం కార్యకర్తలకు వడ్డించారు. కార్యకర్తలు కూడా భారీగానే వచ్చారు. జన సమీకరణ అనుకున్న దానికంటే ఎక్కువగానే చేశారు. పత్రికలలో భారీగా ప్రకటనలు ఇచ్చారు. ఇవన్నీ చూస్తుంటే కవిత అంత ఈజీగా లేరు. పైగా తను కేసీఆర్ కుమార్తె. అలాంటప్పుడు ఆమె తన పార్టీని గట్టిగానే నిర్వహిస్తారు. కెసిఆర్ కూడా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. చివరికి పార్టీని బలోపేతం చేసుకున్నారు. కవిత కూడా అలానే ఉంటుందేమో. ఎందుకంటే తను మాట్లాడుతున్న ప్రతి మాటలో కూడా స్పష్టత కనిపించింది. ధిక్కార స్వభావం వినిపించింది. అలాంటప్పుడు కవిత కచ్చితంగా పార్టీని బలోపేతం చేసుకుంటుందని నమ్మకం కనిపిస్తోందని" విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సెగలు కక్కుతున్న నార్త్ తెలంగాణ

**అదిలాబాద్ :** ప్రపంచంలోని అత్యంత వేడి నగరాల జాబితాలో ఇప్పటికే ఆదిలాబాద్ ఉండగా.. తాజాగా తెలంగాణ నుంచి రామగుండం, కొత్తపేట, మంచిర్యాల పట్టణాలు కూడా ఈ జాబితాలో చేరాయి. ప్రాణ ఎయిర్ ఏక్యూఐ పోర్టల్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. రామగుండం ప్రపంచ వ్యాప్తంగా 59వ స్థానంలో నిలిచింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్ నుంచి 44.4 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఉత్తర తెలంగాణలో భౌగోళిక పరిస్థితులు, పొడి గాలుల ప్రభావం వల్లే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.తెలంగాణలోని భానుడు భగ్గుమంటున్నాడు. ఎంతలా అంటే.. ఉష్ణోగ్రతలు ప్రపంచ రికార్డులను తాకుతున్నాయి. అంతర్జాతీయంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న టాప్-100 నగరాల జాబితాలో ఇప్పటికే ఆదిలాబాద్ ఉండగా.. తాజాగా మరో మూడు తెలంగాణ పట్టణాలు ఈ జాబితాలోకి చేరాయి. రామగుండం, మంచిర్యాల, కొత్తపేట ప్రాంతాల్లో భానుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడని ప్రాణ ఎయిర్ ఏక్యూఐ పోర్టల్ వెల్లడించింది. ఉష్ణోగ్రతల ఆధారంగా నిరంతరం మారుతూ ఉండే ఈ జాబితాలో.. శనివారం నాటి గణాంకాల ప్రకారం రామగుండం 59వ స్థానంలో నిలిచి గ్లోబల్ హాట్‌స్పాట్‌గా మారింది.జాబితాలోని ఇతర వివరాలను పరిశీలిస్తే.. మంచిర్యాల 64వ స్థానంలో, కొత్తపేట 76వ స్థానంలో, ఆదిలాబాద్ 91వ స్థానంలో నిలిచాయి. ఈ నాలుగు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్ నుంచి 44.4 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయి. జాతీయ స్థాయిలో ఉత్తరప్రదేశ్‌లోని బందా, మహారాష్ట్రలోని అకోలా, భుసావల్, జల్గావ్, రాజస్థాన్‌లోని జైసల్మేర్ నగరాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలోని చాలా నగరాలు ఈ జాబితాలో ఉండటం దేశవ్యాప్తంగా



కొనసాగుతున్న తీవ్రమైన వడగాల్పుల పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఈ స్థాయి ఎండలు నమోదు కావడం భౌగోళికంగా ఆశ్చర్యకరం ఏమీ కాదని అంటున్నారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి సరిహద్దుగా ఉండే ఆదిలాబాద్, మంచిర్యాల వంటి జిల్లాలు సహజంగానే వేడి ఎక్కువగా ఉండే ప్రాంతాలని అంటున్నారు. భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త ధర్మరాజు వివరణ ప్రకారం.. ఈ ప్రాంతం 'హీట్ కోర్ జోన్' పరిధిలోకి వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావం వల్ల భూ ఉపరితల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయని ఆయన వెల్లడించారు.కాగా, రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోతోంది. ముఖ్యంగా బొగ్గు గనులు, పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా ఉండే రామగుండం, మంచిర్యాల వంటి చోట్ల వేడి తీవ్రత మరింత అధికంగా ఉంది. ప్రభుత్వం, వాతావరణ శాఖ ఇప్పటికే ఈ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకూడదని సూచించింది. భౌగోళిక కారణాలకు తోడు పొడి గాలుల ప్రభావం తోడవ్వడంతో రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఏప్రిల్ 29 వరకు రాష్ట్రంలో వేడి గాలులు వీస్తాయని చెప్పారు. ఆ తర్వాత జిల్లాల్లో వర్షాలు కురిసే ఛాన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు.

# ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మహానగరం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హెచ్-సిటీ' ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రూ. 7,042 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైంది. నల్లగొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు చేపట్టిన కీలక ఫ్లైఓవర్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. యుద్ధప్రాతిపదికన ఈ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.హైదరాబాద్ మహా నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' పేరుతో తెలంగాణ ప్రభుత్వం భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం కింద మొదలై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు.. ప్రస్తుతం కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ మూడు కార్పొరేషన్ల పరిధిలోని ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేసేందుకు ముగ్గురు కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు



సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మొత్తం రూ. 7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగం.. అంటే సుమారు రూ. 5,942 కోట్లను హెచ్-సిటీ పనులకే కేటాయించింది. ప్రధానంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రూ. 1,090 కోట్లతో చేపట్టిన పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో రూ. 580 కోట్లతో కేబీఆర్ ఎంట్రెన్స్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వంటి కీలక జంక్షన్లలో రెండు స్టీల్ బ్రిడ్జిలు, మూడు అండర్ పాసులను నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీలో రూ. 510 కోట్లతో ఫిల్మ్ నగర్, రోడ్డు నంబర్ 45 జంక్షన్ల వద్ద మరో నాలుగు స్టీల్ బ్రిడ్జిలు, నాలుగు అండర్ పాసులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. ట్రాఫిక్ మళ్లింపులు కూడా చేపట్టారు. మరోవైపు దక్షిణ హైదరాబాద్ ప్రజలు చాలా కాలంగా ఎదురు చూస్తున్న నల్లగొండ ఎక్స్ రోడ్స్ సైదాబాద్ఐఎస్ సదన్ ఓవైసీ జంక్షన్ కారిడార్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. సుమారు 2,530 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ ప్రధాన ఫ్లైఓవర్‌ను రూ. 620 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సైదాబాద్ నుంచి ధోబీఘాట్ జంక్షన్ వరకు ఉన్న కీలక ప్రాంతాల్లో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, కొత్త నగరం మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. గడువులోగా ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటమే లక్ష్యంగా, నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది.

## నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీ

-మొదటిపేజీ తరువాయి

పంపాలని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామని, ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

**జూన్ 2లోగా పూర్తి కావాలి**

నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నామని, ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడుల ఒప్పందాలు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగిందన్న సీఎం సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్, విమానాశ్రయ నిర్మాణం మన కళ్ల ముందే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దిన ఆనాటి నాయకులను కొంతమంది అవహేళన చేశారని అన్నారు.

**అద్భుతమైన నగరానికి పునాదులు**

దేశంలో ఏ నగరానికి లేనివిధంగా 160 కిలో మీటర్ల మేర ఓఆర్ఆర్ నిర్మించారని సీఎం గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యిందన్న ఆయన భూమి ఇవాళ కాకపోతే రేపు అయినా ప్రభుత్వానికి బదిలీ అవుతుందని తెలిపారు. భూమి బదిలీ ఆగే అవకాశం లేదని, తాత్కాలికంగా వాయిదా పడవచ్చని చెప్పారు. ప్రక్రియ జరిగినపుడే పరిహారం డబ్బులు తీసుకుంటే మరోచోట తక్కువ ధరకు భూములు వచ్చేవని రైతులనుద్దేశించి అన్నారు. ఆలస్యమైతే ఎకరాల్లో భూసేకరణ జరిగితే పరిహారం డబ్బులతో గజాల్లో కూడా వేరే చోట భూమి రాదని పేర్కొన్నారు. బాధితుల పిల్లలకు స్కిల్స్ వర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు బాధితులతో మాట్లాడి అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలని, స్థానికులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుత నగరానికి పునాదులు వేగంగా పడతాయని పునరుద్ఘాటించారు.

## తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ నియామకం



తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో సేవలు అందించారు. ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపించిన సంగతి తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమించింది. కేడర్ పరంగా ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్. తెలంగాణ రాష్ట్రంలో ఏఎస్పీ నుంచి మొదలుకొని డీజీపీ హోదా వరకు పలు స్థానాల్లో సుదీర్ఘ కాలం పని చేశారు. ఇంతకు ముందు ఆయన హైదరాబాద్? సీపీగానూ రెండు సార్లు చేశారు. ఆ సమయంలో సినిమా పైరసీ చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. సీవీ ఆనంద్ సీనియారిటీతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయన్నే పూర్తి కాలపు డీజీపీగా నియమించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. ప్రస్తుత ఇంఛార్జి డీజీపీ శివధర్ రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్నారు. అనంతరం సీవీ ఆనంద్ డీజీపీగా బాధ్యతలు స్వీకరిస్తారు.

**రాష్ట్రానికి మూడో పూర్తి కాలపు డీజీపీ**

తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇప్పటి వరకు ఆరుగురు డీజీపీగా పనిచేసినా, పూర్తి కాలపు డీజీపీలుగా ఇద్దరే పని చేశారు. తెలంగాణ తొలి డీజీపీగా పనిచేసిన అనురాగ్‌శర్మ తొలుత తాత్కాలిక డీజీపీగా పని చేసినా తర్వాత యూపీఎస్సీ ద్వారా 2015 నవంబర్ 13న పూర్తికాలపు డీజీపీగా నియమితులయ్యారు. 2017 నవంబర్ 12 వరకు ఆయన కొనసాగిన అనంతరం తాత్కాలిక డీజీపీగా మహేందర్ రెడ్డి ఆ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సైతం యూపీఎస్సీ ద్వారా పూర్తికాలపు డీజీపీగా నియమితులై, 2022 డిసెంబర్ వరకు పని చేశారు. వీరిద్దరి తర్వాత పనిచేసిన అంజనీకుమార్, రవిగుప్తా, జితేందర్‌తో పాటు ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి తాత్కాలిక ప్రాతిపదికనే డీజీపీలుగా వ్యవహరించారు. తాజాగా నియమితులైన సీవీ ఆనంద్ తెలంగాణకు మూడో పూర్తి కాలపు డీజీపీ అవుతారు.

## రేవంత్.. వారితో ఫోన్లు హ్యాక్ చేయిస్తున్నావా?

-మొదటిపేజీ తరువాయి

గొంతులపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతుంది. ఓ కేసులో అనుముల హనుమంత రెడ్డి అనే వ్యక్తిని ఎందుకు అరెస్ట్ చేయలేదు అని అడిగితే కేసు పెడతారా?. రేవంత్ రెడ్డి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. కేసులతో గొంతు నొక్కలేవు. కొంత మంది ఐపీఎస్‌లు మా ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తెచ్చి మాపై నిఘా పెడుతున్నారు. అలాంటి అధికారులు జాగ్రత్త. మీరు రిటైర్డ్ అయిన మిమ్మల్ని వదలం. రేవంత్ సగం కాలం పూర్తయ్యింది. ఇంకా మిగిలి ఉన్న సగ కాలం అయిన మంచిగా పని చేయాలి. రైతుల సమస్యలను రాష్ట్రంలో పట్టించుకునే నాథుడే లేడు. ఆనాడు తాలు తీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎటు పోయాడు?. యాసంగి పంటకు బోనస్ ఇస్తారా లేదా రేవంత్ సమాధానం చెప్పాలి. రైతుల కష్టాలు ఈ ప్రభుత్వానికి పట్టవా?. జూబ్లీహిల్స్ ప్యాలెస్ ఏసీలో కూర్చుంటే సమస్యలు ఎలా తెలుస్తాయి?. రేవంత్ మళ్ళీ గెలిచేది లేదు. ఉన్నన్ని రోజులు అయిన మంచిగా పని చేయాలి' అని వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు

-మొదటిపేజీ తరువాయి

నుంచే తాము అలర్ట్? ప్రకటించామన్నారు. ఈరోజు ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో వేడిగాలుల తీవ్రత కొనసాగుతోంది. దీంతో వాటికి తాము రెడ్? అలర్ట్ పెట్టినట్లు తెలిపారు.

ఉత్తర జిల్లాల్లో ఉపరితల ఆవర్తనం

అవి కాకుండా మిగిలిన ఉత్తర తెలంగాణ జిల్లాలు ఆరెంజ్ అలర్ట్‌లో ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మధ్య జిల్లాలైన సిద్దిపేట, జనగాం, వరంగల్ వంటి వాటిల్లో 36 డిగ్రీల నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నాయన్నారు. మిగిలిన అన్నీ జిల్లాల్లో 41 డిగ్రీల వరకు ఉన్నట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణ మీద ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమై ఉంది. మరొక ద్రోణి కూడా రాయలసీమ, తమిళనాడు మీదుగా కొనసాగుతోంది. వీటివల్ల మనకు తేమ గాలులు వేడిగా ఉన్న భూమిపైకి ప్రవేశిస్తే రాగల నాలుగు రోజుల్లో థండర్ స్ట్రోమ్ కొనసాగనుందని వెల్లడించారు.

"ఒక్కోసారి క్యుములోనింబస్ మేఘాల ఉధృతి నెట్టివేయడంతో అక్కడక్కడా వడగళ్ల వాన పడుతుంది. నిన్న చూసిన దాని ప్రకారం ఒఆర్ఆర్ స్నోఫాల్?లాగా కనబడుతోంది. ఇంకా దాన్ని వెరిఫై చేయాల్సి ఉంది. వర్షాలు కూడా 2 నుంచి 3 సెంటి మీటర్లు మాత్రమే కురుస్తాయి. అయితే నగరాల్లో కాంక్రిటైజేషన్ ఎక్కువగా ఉండటం కారణంగా రాత్రి సమయాల్లో రీరేడియేషన్ ఎక్కువగా ఉంటుంది. దానివల్ల తీవ్రమైన ఉక్కపోత వేడిని ప్రస్తుతం చూస్తున్నాం"

రాబోయే రోజుల్లో వర్షాలు కురిసినప్పటికీ ఉష్ణోగ్రతల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. చాలా వరకు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుందన్నారు. మరికొన్ని జిల్లాల్లో వర్షాలు ఉన్నప్పటికీ మళ్లీ ఆరెంజ్ అలర్ట్‌లోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ వర్షాల వల్ల ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు కనిపించదని పేర్కొన్నారు. తేమ శాతం మాత్రం పెరుగుతుందన్నారు.

## సంపాదకీయం

# బంగారం ఆస్తే...

బంగారం కొనుగోలు విషయంలో భారతీయుల ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు బంగారం అంటే అలంకరణ సాధనంగానే చూసేవారు, నగలనే అధికంగా కొనుగోలు చేసేవారు. అయితే, పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాలకు చేరిన క్రమంలో బంగారాన్ని పెట్టుబడిగా పరిగణిస్తున్నారు. బంగారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. ధరలు తగ్గడం మహిళలకు కొంత ఉపశమనం కలిగించినట్లే. అయితే దేశీయ మార్కెట్లో గత మూడు రోజులుగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ 28న కూడా స్వల్పంగా తగ్గాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు ఒక్కసారి మాత్రమే పెరిగాయి. అంటే ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడం, క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డ్ స్థాయిలోనే ఉండడం వంటివి బంగారం ధరలు తగ్గేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెలలో 24న బంగారం ధరలు కాస్త పెరిగినట్లు కనిపించినా రికార్డ్ గరిష్ఠాలకు చాలా దూరంగానే ఉన్నాయి2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి చేరినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ముందు ముందు ఇది మరింత పెరగవచ్చు నివేదిక తెలిపింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. ఏడాది కాలంలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఈ క్రమంలో భారతీయులు బంగారం కొనుగోలు చేసే దృక్పథం మార్చుకుంటున్నారని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో గత ఏడాది 2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి ఎగబాకినట్లు తెలిపింది. అంతకు ముందు ఏడాది వరకు అది 30 శాతానికి లోపే ఉండాదని, మిగితా 70 శాతం పైన అలంకరణ కోసం బంగారు ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేసే వారని పేర్కొంది. అయితే, ధరలు పెరుగుతుండడం వంటి కారణాలతో నగలకు బదులుగా ఆస్తులకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొంది.గత ఏడాదిలో పెట్టుబడుల కోసం మేలిమి బంగారం కొనుగోళ్లు, డిజిటల్ విధానంలో కొనుగోళ్లు అనేవి ఎక్కువగా జరిగాయని కేర్ ఎడ్జ్ నివేదిక పేర్కొంది. బంగారం ఈటీఎఫ్‌ల ద్వారానే ఏకంగా 37.5 టన్నుల బంగారానికి సమానమైన పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది. గత 10 సంవత్సరాల కాలంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల కంటే ఇది ఎక్కువగా ఉండడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ మొత్తం బంగారం వినియోగంలో పెట్టుబడుల విలువ 35-40 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేసింది. 2026లోనూ బంగారం ధరలు గరిష్ఠ స్థాయుల్లోనే కొనసాగుతాయని కేర్ ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అంచనా వేశారు.గత ఏడాది 2025లో నగల గిరాకీ, విలువ పరంగా వార్షికంగా 10 శాతం మేర పెరిగి రూ.4.8 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాలకు మొగ్గు చూపుతున్నారని, అలాగే ఈ లోహాల అమ్మకాల పరిమాణ 15 శాతం మేర పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో ఆభరణాల పెద్ద వ్యాపారులు 35 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అది 20-25 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసిందిఈ ట్రెండ్ భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ధోరణి మారుతోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. 2025లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 2175 మెట్రిక్ టన్నులకు చేరిందని, అది అంతకు ముందు 2020లోని 1805 టన్నులను మించినట్లు తెలిపింది. ఇందులో ఎక్స్ఛేంచ్ ట్రేడెడ్ ఫండ్స్ వాటానే ఎక్కువగా ఉందని తెలిపింది. అలాగే బంగారు కడ్డీలు, నాణెల కొనుగోలు సైతం పెరిగిందని, అది 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. భారత్‌లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2025 ఒక్క ఏడాదిలోనే 37.5 టన్నులకు సరిపడా పెట్టుబడులు వచ్చాని పేర్కొంది.అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణస్వామి అంచనాల ప్రకారం ఆర్‌బీఐ వద్ద సుమారు 800-820 టన్నుల బంగారం ఉంది. అలాగే దేశంలో ఆర్థికంగా వెలికితీయగల బంగారం సుమారు 70-80 టన్నులు మాత్రమే" అని ఆయన చెప్పారు.ఆర్థికంగా వెలికితీయగల బంగారం అంటే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా తవ్వి తీసుకోగల బంగారం అని అర్థం.భారత్‌లో మంచి నాణ్యత గల బంగారం తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ మైనింగ్ పోటాపోటీగా ఏమీ జరగదు" అని ప్రొఫెసర్ సుందరవల్లి అంటున్నారు."భారతీయుల దగ్గర చాలా బంగారం ఉంది. ఎంత బంగారం ఉందనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది సాధారణంగా 25 వేల నుంచి 27 వేల టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.ఈ అంకెకు ఆధారం ఏంటని అడగ్గా, ఇది చాలా మంది నమ్మే ఒక సాధారణ అంచనా మాత్రమే అని ఆయన అన్నారు."ప్రతిఏటా 600 నుంచి 700 టన్నుల బంగారం దిగుమతి అవుతుండగా, ఎగుమతి చాలా తక్కువ. అందుకే ఈ బంగారం ఇళ్లలో ఉండిపోయింది" అని ఆయన చెప్పారు.భారత్ వద్ద 2026 ఫిబ్రవరి నాటికి అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం ఉన్నట్టు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది.ఈ విషయంలో భారత్ ప్రపంచంలో 9వ స్థానంలో ఉంది. దీనికంటే ముందు అమెరికా, జర్మనీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్ ఉన్నాయి.అయితే అధికారిక నిల్వలు భారతదేశపు బంగారు కథలో ఒక భాగం మాత్రమే."మన దగ్గర సుమారు 50 కోట్ల టన్నుల పసిడి ధాతువు (అంటే బంగారం కలిగిన రాయి/మట్టి) ఉంది, కానీ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది" అని థరూర్ తన వ్యాసంలో రాశారు.దేశంలో మొత్తం 518.23 మిలియన్ టన్నుల పసిడి ధాతువు ఉన్నట్టు నేషనల్ మినరల్ ఇన్వెంటరీ చెబుతోంది.అయితే దీనర్థం ఈ పసిడిధాతువునంతటినీ వెలికి తీయడం తేలికైన పని అని కాదు. ఇందులో 494.50 మిలియన్ టన్నుల బంగారం వెలికితీయడం కష్టమైనది కాగా, 23.72 మిలియన్ టన్నులను మాత్రం రిజర్వ్‌గా పరిగణిస్తారు.రిజర్వ్ అంటే బంగారాన్ని వెలికితీయడం లాభదాయకంగానూ, సులభంగా సాధ్యమయ్యే స్థితి.

# ఇంధన కొరత

ఇరాన్ యుద్ధం మన ఇంట్లోకి, ఇంకా చెప్పాలంటే వంటింట్లోకి వచ్చి అతలాకుతలం చేస్తున్నది. యుద్ధం తీసుకువచ్చిన వంటగ్యాస్ సంక్షోభం ఇంకా వేధిస్తూనే ఉన్నది. వాణిజ్యపరమైన వంటగ్యాస్ కొరత కారణంగా హాస్టళ్లు మూతపడటమో, మెనూను తగ్గించటమో చేశాయి. ఇప్పుడు వాహనాల ఇంధనం సమస్య వీధికెక్కి వీరంగం వేస్తున్నది. నెలరోజుల క్రితం భయాందోళనలతో ప్రజలు అతికొనుగోలుకు పాల్పడటంతో బంకుల వద్ద రద్దీ, నోస్టాక్ బోర్డులు వెలిశాయి. కాలక్రమంగా యుద్ధ తీవ్రతతో పాటు ఇది కూడా కొంత నెమ్మదించింది. కానీ గత మూడు, నాలుగు రోజులుగా మండేఎండలో బంకుల వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరుతుండటం కనిపిస్తున్నది. అత్యవసర సేవలందించే అంబులెన్సులు కూడా క్యూలైన్లలో నిలుస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఇలా వాహనాలు పోటెత్తడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతున్నది. క్యాబ్ బుకింగుల్లోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. అటు గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన కొరత వల్ల సాధారణ రవాణాతోపాటు వ్యవసాయం రంగంపై తీవ్ర ప్రభావం పడుతున్నది. డీజిల్ అందుబాటులో లేకపోవటంతో హార్వెస్టర్ యంత్రాలు పనిచేయటంలేదు. దిగుబడి అయిన ధాన్యాన్ని కాంటాల వద్దకు తరలించటమూ వీలుకావటం లేదు. ఈ పరిస్థితికి యుద్ధం ప్రత్యక్షంగా కారణమా? లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణాలోపం కారణమా? అనేది ప్రశ్న. వాహనదారులు బంకులకు పరుగులు తీయటానికి ఇంధనం కొరత, ధరల పెరుగుదలపై సోషల్ మీడియాలో పోటెత్తుతున్న వదంతులు కారణమవుతున్నాయనేది తెలిసిందే. నిల్వలున్నాయని, సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని ఇటు రాష్ట్ర పౌర సరఫరా విభాగం గానీ, అటు కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలోని చమురు కంపెనీలు ప్రకటించి చేతులు దులిపేసుకుంటున్నాయి. అయితే, వీరి ప్రకటనలకు భిన్నంగా అనేక బంకులు దగ్గర నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడా తెరచి ఉన్న బంకుల వద్ద విపరీతమైన రద్దీ ఉండటం చూస్తే పరిస్థితి అంత సవ్యంగా ఏమీ లేదని సూచిస్తున్నది. చమురు కంపెనీలు అనుసరిస్తున్న క్రెడిట్ విధానం ఇంధన సరఫరాతో చెలగాటమాడుతున్నదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. యుద్ధం వల్ల



అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరుగుతున్నాయి. దాంతో మనదేశంలోనూ వాహన ఇంధనాల ధరలు పెంచక తప్పని పరిస్థితి ఎదురవుతున్నది. కానీ ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రస్తుతానికి ఆ జోలికి వెళ్లటం లేదు. కానీ, ఈ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ధరలు పెరుగడం మాత్రం ఖాయంగా కనిపిస్తున్నది. ఈలోగా కంపెనీలు ఎంత చమురు అమ్మితే అంత నష్టం అనే ధోరణిలో సరఫరాను కృత్రిమంగా నియంత్రిస్తున్నాయి. ముందస్తుగా డబ్బు చెల్లిస్తేనే ట్యాంకర్ కదులుతుంది అనే విధానం అమలు చేస్తున్నాయి. కొన్ని బంకుల యాజమాన్యాలు రెండేసి ట్యాంకర్ల కోసం డబ్బులు కట్టినా కేవలం ఒక్క ట్యాంకర్‌నే పంపడం వంటివి కృత్రిమ నియంత్రణవైపే వేలెత్తి చూపిస్తున్నది. అటు ధరల విషయంలో కేంద్రం, ఇటు సరఫరా విషయంలో చమురు కంపెనీలు ఆడుతున్న నాటకం సామాన్యులకు సంకటంగా మారింది. 2016లో పెద్దనోట్ల రద్దుతో బ్యాంకుల వద్ద ప్రజలు క్యూలు కట్టాల్సి వచ్చింది. వారాల తరబడి నగదు లేని పరిస్థితి. 2017లో జీఎస్టీ తిప్పలు మొదలయ్యాయి. ఇంధన ధరలు తగ్గించవచ్చని అధికారంలో లేనప్పుడు హంగామా చేసిన బీజేపీ పాలనలో 2018-23 మధ్యకాలంలో ఇంధన ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా అన్ని రంగాలపై దీని ప్రభావం పడింది. ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలిపినా కేంద్రం మనసు కరుగలేదు. 2020-21 మధ్యకాలంలో మోదీ సర్కార్ వ్యవసాయరంగంలో నల్లచట్టాలను ప్రవేశపెట్టింది. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతుల నిరసనలతో దేశం దద్దరిల్లింది. 2022లో రైల్వే రిక్రూట్‌మెంట్ నిరసనలతో బీహార్, యూపీ రాష్ట్రాలు అట్టుడికాయి. అదే ఏడాది ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీంకు నిరసనగా యువజనులు చేపట్టిన పోరు హింసాత్మకంగా మారింది. ఇక కరోనా కల్లోలంలో ప్రజలను సిద్ధం చేయకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా రాత్రికిరాత్రే ప్రకటించిన లాక్‌డౌన్‌తో, ప్రజలు..ముఖ్యంగా వలస కూలీలు అనుభవించిన నరకం ఈ దేశం ఎప్పటికీ మరిచిపోదు. ఇక వ్యాక్సిన్ కొరత వల్ల ఎదుర్కొన్న సమస్యలది వేరే కథ. ఇప్పుడు చమురు సరఫరాలో అసమర్థత, అవతకతవకలు వచ్చిచేరాయి. అమెరికా హుకూంలన్నిటికీ తలొగ్గుతున్న మోదీ సర్కార్ దేశానికి సరిపడా ఇంధనం ఎందుకు తేలేకపోయింది? తానే టాంటాం వేసినట్టుగా తగ్గింపు ధరలకు ఎందుకు ఇవ్వలేకపోతున్నది? ఇవీ ప్రజల మనసుల్లో మెదులుతున్న ప్రశ్నలు.

# జల వివక్షపై ఎలుగెత్తి చాటిన గళం

తెలంగాణ చారిత్రక ప్రస్థానంలో నీరు ప్రకృతి వనరు మాత్రమే కాదు; అది ఈ గడ్డ ఆత్మాభిమానం, అస్తిత్వం, కోట్లాదిమంది రైతుల జీవన్మరణ సమస్య. వలస పాలకుల స్వార్థపూరిత పాలనలో దశాబ్దాల పాటు సాగిన జలదోపిడీ, ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అంకెల గారడీ, సాంకేతిక కుట్రలను శాస్త్రీయంగా ఛేదించి తెలంగాణ సమాజాన్ని నిద్రాణస్థితి నుంచి మేల్కొల్పిన అపర భగీరథుడు ఆర్.విద్యాసాగర్‌రావు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా సాగునీటి రంగంలో సాగించిన అలుపెరగని పోరాటం, మలిదశ ఉద్యమానికి ఆయన అందించిన మేధోసంపత్తిని విశ్లేషించుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ కనీస బాధ్యత. 1939 నవంబర్ 14న నల్గొండ జిల్లా, జాజిరెడ్డిగూడెంలో లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యాసాగర్‌రావు జన్మించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆయన తండ్రి రాఘవరావు ఆ గ్రామంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన తొలి వ్యక్తి కావడం, వారి కుటుంబంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత, విద్యాసాగర్‌రావు ఎదుగుదలకు బలమైన పునాది వేసింది. ఆ గ్రామం నుంచి మొట్టమొదటి ఇంజినీరింగ్ పట్టభద్రుడిగా నిలిచిన ఆయన, 1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందారు. 1979లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుత ఐఐటీ రూర్కీ) నుంచి జలవనరుల అభివృద్ధిలో మాస్టర్స్ డిగ్రీ సాధించారు. 1983లో అమెరికాలోని కొలరాడో స్టేట్ యూనివర్సిటీ నుంచి వాటర్ రిసోర్స్ సిస్టమ్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పొందారు. 1990లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకోవడం ఆయన మేధోపటిమకు నిదర్శనం. ఈ అసాధారణ విద్యా నేపథ్యమే అంతర్రాష్ట్ర జల వివాదాలు, ట్రిబ్యునల్ తీర్పులను చట్టబద్ధంగా, సాంకేతిక కోణంలో విశ్లేషించే తిరుగులేని శక్తిని ఆయనకు ప్రసాదించింది. 34 ఏండ్లపాటు కేంద్ర జల సంఘంలో చీఫ్ ఇంజినీర్ వంటి అత్యున్నత హోదాల్లో పనిచేసిన విద్యాసాగర్‌రావుకు దేశవ్యాప్త నదీ పరీవాహక ప్రాంతాల గమనశీలత, నీటి కేటాయింపుల సూత్రాలపై అపార అవగాహన ఉండేది. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలో ఏవిధంగా పకడ్బందీగా కోత విధిస్తున్నారో ఆయన నిశితంగా గమనించారు. ఉద్యోగ విరమణ అనంతరం విద్యాసాగర్‌రావు తన శేషజీవితాన్ని తెలంగాణ జలహక్కుల పోరాటానికే అంకితం చేశారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రధాన జలవనరుల సలహాదారుగా ఉంటూ, ప్రతి ప్రాజెక్టు రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమకాలంలో కేసీఆర్ చేసే ప్రసంగాల్లోని జల గణాంకాల వెనుక విద్యాసాగర్‌రావు మేధస్సు దాగి ఉండేది. ప్రాజెక్టుల రీ-డిజైనింగ్, నీటి కేటాయింపుల విషయంలో ఆయన సలహాలు ఉద్యమ నాయకత్వానికి దిక్సూచిలా పనిచేసేవి. అందుకే కేసీఆర్ ఆయనను 'జయశంకర్ సార్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప మహానుభావుడు' అని సగర్వంగా కొనియాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా జయశంకర్ దిశానిర్దేశం చేస్తే, సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయాలను ప్రజల కండ్లకు కట్టినట్లు చూపిన ఘనత విద్యాసాగర్‌రావుకే దక్కుతుంది.'నీళు-నిజాలు' పేరుతో ఆయన రాసిన వ్యాసాలు తెలంగాణ ప్రజల కండ్లు తెరిపించాయి. పత్రికల్లో ఆయన విశ్లేషణలు చదివిన సామాన్య రైతుకు కూడా తన నీటి హక్కుల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల వెనుక విద్యాసాగర్‌రావు మార్గదర్శకత్వం ఉన్నది. ముఖ్యంగా 'మిషన్ కాకతీయ' ద్వారా గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ జరుగాలని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఆయన బలంగా విశ్వసించేవారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, ప్రాజెక్టుల ఎత్తు, నీటి లభ్యత వంటి అంశాల్లో ఆయన సూచనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన విద్యాసాగర్‌రావు, మన దేశ 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలోనూ విలువైన సలహాలు అందించారు. 2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆయనను 'లీడింగ్ ఇంజినీరింగ్ పర్సనాలిటీ ఆఫ్ ఇండియా'గా గౌరవించటం వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. 2016 నవంబర్‌లో వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఒక సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగం భవిష్యత్తు అంతా సాగునీటి ప్రాజెక్టుల విజయవంతంపైనే ఆధారపడి ఉన్నదని స్పష్టం చేశారు. కొంతకాలం అనారోగ్యంతో బాధపడి 2017 ఏప్రిల్ 29న విద్యాసాగర్‌రావు తుదిశ్వాస విడిచారు. ఆయన వదిలిన మేధోసంపత్తి తెలంగాణకు ఎప్పటికీ రక్షాకవచమే. తెలంగాణ ప్రతి ఎకరానికి నీరు అందించాలన్న ఆయన కల సాకారమవుతుండటం ఆయనకు నిజమైన నివాళి. సాగునీటి అన్యాయంపై ఆయన ఎలుగెత్తి చాటిన గళం, తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరుపుకోవటం అంటే కేవలం ఒక వ్యక్తిని స్మరించుకోవటం కాదు, తెలంగాణ జల సార్వభౌమాధికారం కోసం పోరాడతామని ప్రతిజ్ఞ చేయటమే.

# ఫిరాయింపులు... ప్రశ్నలు!

ఆప్ నుంచి నిష్క్రమించిన ఏడుగురు రాజ్యసభ సభ్యులతో ఏర్పడిన ఎంపీల బృందం బీజేపీలో విలీనం కావడాన్ని గుర్తిస్తూ రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నిర్ణయం తీసుకోవటంతో ఫిరాయింపుల చట్టం ప్రహసనప్రాయమని మరోసారి తేలిపోయింది. బహుశా ఎన్నికల ముంగిట్లోవున్న పంజాబ్‌లో రేపో మాపో ఆప్ ప్రభుత్వానికీ ఇలాంటి గండం తప్పకపోవచ్చు. ఆప్ పుట్టుక, ఎదుగుదల భిన్నమైనవి. 2011--12 మధ్య దేశంలో హోరెత్తిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అగ్రభాగాన నిలిచిన కొద్దిమంది రాజకీయేతర నేతల్లో కేజ్రీవాల్ ఒకరు. ఆయన మాదిరే పూర్వాశ్రమంలో ఉన్నతోద్యోగ వర్గంలో, భిన్న సామాజిక రంగాల్లో పనిచేసి కొన్ని ఆదర్శాలు నమ్మి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఆదర్శాల్లో పుట్టి, వైవిధ్యాలతో ఎదిగి, స్వల్పకాలంలోనే మధ్యతరగతిలో పాతుకుపోయిన ఆ పార్టీ అచిరకాలంలోనే సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ సారథుల్లో భిన్నాంశాలపై అప్పటికే ఉన్న మౌలిక విభేదాలు పలు నిష్క్రమణలకు దారితీశాయి. శాంతి భూషణ్, ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్, అడ్మిరల్ రాందాస్ వంటి లబ్ధప్రతిష్టులైనవారిని కీలక పదవులనుంచి తప్పించారు. కొందరు వారికై వారు తప్పుకున్నారు. అటు తర్వాత మధ్యలో అడపా దడపా ఒకరిద్దరు నేతలు నిష్క్రమించినా ఇప్పుడు రాఘవ్ చడ్డా కొట్టిన దెబ్బ సామాన్యమైనది కాదు. ఒక సమస్య విషయంలో పార్టీ వైఖరితో ఏకీభావం లేనప్పుడూ, దాని సిద్ధాంతాలు దారితప్పుతున్నాయనుకున్నప్పుడూ బయటకుపోతే ఎవరూ తప్పుబట్టరు. కానీ పెద్ద మాటలు మాట్లాడుతూ, గంభీరమైన ఉపన్యాసాలిస్తూ కాస్తయినా నైతికత పాటించాలన్న స్పృహ లేనివారిని జనం చీదరించుకుంటారు. ఒక సాధారణ గుమాస్తా సంస్థ నుంచి తప్పుకుంటే మూణ్ణెల్ల నోటీసు ఇవ్వాలన్న నిబంధన ఉంటుంది. లేకుంటే సంస్థలు వాటి పద్ధతిలో అవి చర్య తీసుకుంటాయి. ప్రజానీకం సమస్యల్ని చర్చిస్తూ వారి సంక్షేమానికీ, భద్రతకూ అవసరమైన చట్టాలు తీసుకొచ్చే కర్తవ్యంలో నిమగ్నమై ఉండాల్సినవారికి మాత్రం ఏ నిబంధనా ఉండొద్దా? వారి ప్రవర్తన నలుగురికీ ఆదర్శప్రాయం కావొద్దా? రాజీవ్ గాంధీ హయాంలో 1985లో ఈ ఫిరాయింపుల జాడ్యాన్ని వదిలిస్తామంటూ 52వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి రాజ్యాంగంలో పదో షెడ్యూల్ చేర్చారు. కానీ అది ఎందుకూ కొరగాకుండా పోయిందని తేలిన చాన్నాళ్ల తర్వాత 2003లో 91వ రాజ్యాంగ సవరణ వచ్చింది. అందులో కేవలం లెజిస్లేచర్ పార్టీలో మూడింట రెండొంతుల మంది తప్పుకుని వేరే పార్టీలో విలీనమైతే సరిపోదనీ, ఆ చీలిక, విలీనం పార్టీ స్థాయిలో కూడా కనబడాలనీ నిర్దేశించింది. దురదృష్టమేమంటే... ఈ ప్రాతిపదికన ఫిరాయింపులు రాజ్యాంగ విరుద్ధమని మన న్యాయస్థానాలు తీర్పులిచ్చిన సందర్భాలు లేవు. ఫిరాయింపు సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని సభాధ్యక్షుల దగ్గర ఫిర్యాదులైతే దాఖలవుతున్నాయి. కానీ వాటిపై వేగంగా నిర్ణయం తీసుకున్న ఉదంతాలు లేవు. సుప్రీంకోర్టు గడువు విధించటంతో తెలంగాణ స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఇటీవల నిర్ణయం తీసుకోక తప్పలేదు. కానీ బీఆర్‌ఎస్ వినతుల్ని ఆయన తోసిపుచ్చారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభలోనూ, ఏపీ అసెంబ్లీలోనూ చేసిన ఫిర్యాదులు తేలకుండానే ఆ సభల పదవీకాలం ముగిసిపోయింది. ఫిరాయించటానికి సృజనాత్మక మార్గాలు ఎంచుకోవటం నేతలకు వెన్నతో పెట్టిన విద్య అయిపోయింది. ఏపీలో ఆ మధ్య వైఎస్సార్ కాంగ్రెస్‌కు చెందిన కొందరు రాజ్యసభ సభ్యులు ఏకంగా అయిదేళ్లకు మించి గడువున్న ఎంపీ పదవులకు కూడా రాజీనామా చేసి పోయారు. ఆ తర్వాత వారిలో కొందరు బీజేపీ, టీడీపీల పంచన 'ఎన్నికయ్యారు'. నైతిక విలువలు లేకపోవటమే పెద్ద అర్హతగా మారిన వర్తమానంలో ఇలాంటి వెర్రిమొర్రి పోకడలు కనబడటం వింతేం కాదు. రాఘవ్ చడ్డా నిష్క్రమించదల్చుకున్నప్పటి నుంచీ మధ్యతరగతి పెను సమస్యలుగా భావించేవాటిని సభలో ప్రస్తావించటం, వాటిల్లో కొత్తేం లేకపోయినా అవి వైరల్ కావటం వెనకున్న సారాంశం చాలామంది గ్రహించకపోలేదు.

# ‘అన్నా’ అంటేనే అంత ఆగ్రహమా?

## ఖాకీల జులూంపై ఎస్ఎస్డీ ఆగ్రహం

**అగ్ని ధార న్యూస్, (కరీంనగర్):**

నగరంలోని ఓ సెలూన్ షాపులో కార్మికుడిపై ఎస్సై చందర్ ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని సమత సైనిక్ దళ్ (ఎస్ఎస్డీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్శల్ దుర్గం నగేష్ మండిపడ్డారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పోలీసు అధికార దుర్వినియోగాన్ని తీవ్రంగా ఖండించారు. ఖాకీ దుస్తులు ధరించామని సామాన్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలను కోవడం సహించబోమని హెచ్చరించారు. ఒక మనిషిని గౌరవంగా ‘అన్నా’ అని సంబోధించినందుకు కార్మికుడు రాముపై దాడి చేయడం అమానుషమని నగేష్ అన్నారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు రౌడీల తరహాలో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. అధికార గర్వం, అహంకారంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ అన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఎస్సైపై కేవలం విచారణతో సరిపెట్టకుండా విధుల నుంచి తొలగించాలని కోరారు. భవిష్యత్తులో కార్మికులు, సామాన్యులపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించాలని అన్నారు. బాధితుడు రాముకు సమత సైనిక్ దళ్ పూర్తి అండగా ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని డాక్టర్ మార్శల్ దుర్గం నగేష్ స్పష్టం చేశారు.



## తబితా ఆశ్రమంలో చైల్డ్ సేఫ్టీపై అవగాహన
## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**: పోలీస్ కమిషనర్**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండంలోని తబితా ఆశ్రమంలో ‘చైల్డ్ సేఫ్టీ -- డ్రగ్స్‌కు నో చెప్పండి’ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు, భవిష్యత్‌పై పడే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధి కోసం ఆశ్రమంలోని పిల్లలకు క్రీడా సామగ్రి, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, పోలీసు సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ధారి మైసమ్మ మహోత్సవం



**రెండో రోజు పూజల్లో పాల్గొన్న మనాలి రాజ్ ఠాకూర్**

**అగ్నిధార న్యూస్ (పాలకుర్తి):**

పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లో నిర్వహిస్తున్న ధారి మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం రెండో రోజు పూజా కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో కళకళలాడింది. మనాలి రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ఏప్రిల్ 29న జరగనున్న ధారి మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ మహోత్సవం ఆధ్యాత్మికంగా, సాంప్రదాయబద్ధంగా విశేష ప్రాధాన్యం కలిగినదని తెలిపారు. కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

## ఇదిస్పెషల్ ఇంట్రెస్ట్ ఆన్ టీఆర్ఎస్

**హైదరాబాద్** సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చాను. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వల్ల ఒరిగేదేమీ లేదని యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ శివకుమార్ వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు అయన సిట్ విచారణకు హజరయ్యారు. శివకుమార్ మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల సమయంలో నా ఫోన్ టాప్ అయిందని అధికారులు చెప్పారు. మునుగోడు ఎన్నికల్లో నేను పోటీ చేశాను.. నాకు కేంద్ర ఎన్నికల సంఘం రోలర్ గుర్తు కేటాయించారు. గుర్తు ఎవరికి ప్రయోజనం చేకూర్చులా ఉంది అని తెలుసుకోవడానికి నా ఫోన్ ట్యాప్ చేశారు. ఆ సమయంలోనే అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ఆయన టీం నా ఫోన్ టాప్ చేశారు. సిట్ అధికారులు విచారణలో కొన్ని ఆధారాలు చూపించారు... సిట్ వద్ద కూడా పూర్తి డేటా లేదు. కేవలం 15 రోజులకు సంబంధించిన డేటా మాత్రమే సిట్ అధికారుల వద్ద ఉంది. మునుగోడు ఎన్నికల సమయంలో అధికారులు అత్యుత్సాహంతో నా ఫోన్ టాప్ చేశారు..

## మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలను విజయవంతం చేయాలి



**కరపత్రాలను ఆవిష్కరించిన ఏఐటీయూసీ నాయకులు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర రెండో మహాసభలను జూన్‌లో నిర్వహించనున్నట్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌తో కలిసి మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయిస్తున్నాయని విమర్శించారు. జూన్ 12 నుంచి పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, అయితే కార్మికుల వేతనాలను మాత్రం రూ.3 వేలకే పరిమితం చేస్తున్నట్లు ఆరోపించారు. వేతనాల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో ఇచ్చిన సమ్మె పిలుపును రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసి, జూన్ 12 నుంచి సమ్మెకు సిద్ధంగా ఉండాలని మధ్యాహ్న భోజన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, రామగుండం మండల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఓదెల రమేశ్, నాయకులు బి. రజిత, ఎండి సహానా, కత్తెర మల్లసరిత, లావణ్య, ఫాతిమా, అజీర తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు



**లింగ సమానత్వం, సైబర్ భద్రతపై విద్యార్థులకు చైతన్యం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం)::**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం పలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏహెచ్‌టీయూ ఎస్ఐ శైలజ ఆధ్వర్యంలో సెంట్ క్లేర్స్ హైస్కూల్ (ఎన్టీపీసీ), శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ (గోదావరిఖని), కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల (సీసీసీ, నస్పూర్), ఏకలవ్య ఆశ్రమం--సేవా భారతీ (మంచిర్యాల)లో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, పిల్లల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళలపై ద్వేష భావాలు, లింగ వివక్ష, జెండర్ బైయాస్, హింస, సైబర్ నేరాలు, సైబర్ బులీయింగ్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా షీ టీమ్స్ సేవలు, మహిళలు--పిల్లలు ఎదుర్కొనే సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. యువతలో భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## రిపోర్టర్ హత్యను ఖండిస్తున్నాం..

**తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు యూసుఫ్ బాబా**

**నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ పరిధిలోని వి.కోట ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యకు గురి కావడం బాధాకరమైన విషయం మనీ,మార్నింగ్ వాక్ చేస్తుండుగా ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి కత్తులతో పొడిచి చంపి అతి దారుణంగా హత్య చేశారు. రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండిస్తున్నట్లు తెలంగాణ జర్న లిస్టు అసోసియేషన్ జిల్లా నాయకులు యూసుఫ్ బాబా తెలిపారు. అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా ఉండే రిపోర్టర్లను హత్య చేయడం బాధాకరమైన విషయం అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వనికి కోరారు.

## మజ్జిగ పంపిణీ



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

మంగళవారం పెద్దపెల్లి జిల్లా కమాన్పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలకు జూలపల్లి సర్పంచ్ పోల్దాసరి వనిత సాయికుమార్ గారి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుమ్మడి సదయ్య గారు , పులి లక్ష్మణ్ ఉపాధి హామీ కూలీలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

## రైతులకు అవగాహన సదస్సు



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

మంగళవారం నాగారం రైతు వేదికలో రైతులకు సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ శ్రీ వైనాల రాజు మాట్లాడుతూ రైతులకు సిఫారసు మేరకే ఎరువుల వినియోగం చేయాలని లేనిచో అట్టి ఆహార ఉత్పత్తులు తిన్న ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వివరించడం జరిగింది, అదేవిధంగా కెవికె రామగిరిఖిల్లా సాయిల్ సైన్స్ శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ సూక్ష్మ, స్థూల పోషకాలను అన్నింటిని మొక్కల అవసరం మేరకే అందించాలని తెలియజేశారు అదేవిధంగా భూసార పరీక్ష ఆధారితంగా ఎరువులను వినియోగించడం ద్వారా పంటల దిగుబడితోపాటు నేలను కాపాడుకోవచ్చని వివరించడం జరిగింది, అదేవిధంగా తొలకరి వర్షాలకు ముందుగా జీలుగా జనము వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయాలని సూచించారు, అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరి కోతుల అయిపోయిన తర్వాత రైతు సోదరులు ఎట్టి పరిస్థితులలో వరి కోయలను తగలబెట్టవద్దని, నీటి సౌకర్యం ఉన్న రైతు సోదరులు పచ్చి రొట్టె ఎరువుల కొరకు తడులను వేస్తూ వరిగడ్డి కుళ్లిపోయే విధంగా జాగ్రత్త తీసుకోవాలని సూచించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు , కె.వి.కె రామగిరి జిల్లా శాస్త్రవేత్త కిరణ్ కుమార్ , నాగారం గ్రామ సర్పంచ్ కుమార్ , నాగారం గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్ , మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్వేత, రైతు సోదరులు పాల్గొన్నారు.

## 18వ రోజు రిలే దీక్ష విరమణ



**మంద కొమరమ్మ కాలనీవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

మందకృష్ణ మాదిగ సూచనల మేరకు ఆయన ప్రతినిధులుగా వచ్చిన మందకుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, ఇంజమ్ వెంకట్ స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సమన్వయకర్తలు 18వ రోజు రిలే నిరాహార దీక్షకు ముఖ్య అతిథులుగా హాజరై దీక్షకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక అడుగు వెనక్కి వేసినంత మాత్రాన పోరాటం ఆగిపోదని, పది అడుగులు ముందుకు వేయడానికి మరింత శక్తిని సమీకరించుకునే ప్రక్రియ మాత్రమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మేయర్ స్పందించి మంద కొమరమ్మ కాలనీవాసులకు తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి ఏకు శంకర్, రాష్ట్ర నాయకులు అంబాల రాజేందర్, మంద రవికుమార్, రాసపల్లి రవికుమార్, కన్నూరి ధర్మేందర్, పల్లె బాపు, మడిపల్లి దశరథం, కాశిపేట రాజయ్య, కాశిపేట సదానందం, రెంటాల రాధా, కోండ్రా అరుణ, రామంచ సరోజన, అంబాల అర్చన, మచ్చ సుజాత, ఆవునూరు గౌరీ, అడ్డూరు అంజలి, ఈదునూరి పద్మ, మైస రవీందర్, ఈర్ల రవి, కలవల ప్రదీప్, పుల్లూరు కొమురయ్య, కనకం సుగుణ, అంబాల రాజ్‌కుమార్, రాచర్ల రాయశం తదితరులు పాల్గొన్నారు.

## మేడే వేడుకలకు సన్నాహాలు

**కార్మిక సంఘాల నేతలకు అవగాహన కార్యక్రమం**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**



మేడే ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల యూనియన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాల అమలు, భద్రతా చర్యలపై అధికారుల ద్వారా వివరించారు. పెద్దపల్లి, గోదావరిఖని, మంథని ప్రాంతాలకు చెందిన కార్మిక శాఖ అధికారులు, దళిత బహుజన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొంకూరి కైలాసం, వివిధ యూనియన్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు చేరేలా యూనియన్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. మేడే ఉత్సవాలను విజయవంతం చేయడంలో కార్మిక సంఘాల నాయకులు ముందుండాలని పిలుపునిచ్చారు.

# వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయాలి

**సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి**
**ఎస్ఐ హైమ**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ హైమ సూచించారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మహిళలు, పిల్లల భద్రత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ వేధింపులు ఎదురైతే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. లింగ సమానత్వం సమాజాభివృద్ధికి కీలకమని, మహిళలు--పురుషులకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా అందరూ కృషి చేయాలని అన్నారు. బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు బాలికల వివాహాలు జరగకుండా సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098 హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని కోరారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ వనజ, అధ్యాపక బృందం, షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.






# కరాటేలో డ్రాగన్ షోటోకాన్ విద్యార్థుల గిన్నిస్ రికార్డు



**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు.కరాటే మాస్టర్ పసునూటి చందు మాట్లాడుతూ పోటీల్లో సుమారు రెండు వేల మందికి పైగా విద్యార్థులు, మాస్టర్లు పాల్గొన్నారని తెలిపారు. కాటా విభాగంలో ఏకధాటిగా 40 సార్లు కాటా ప్రదర్శన ఇవ్వడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదు అయినట్లు చెప్పారు.క్లబ్‌కు చెందిన సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో టింగు జయసాయి చరణ్, సహస్ర, ఆయన్ష్, కృతిక్, సాయి రోషన్, స్పందన, అనన్య, ఎం.డి జైన్, సర్వీన్ రెడ్డి, లాస్యప్రియా, ప్రణీత్, రోనీత్ కుమార్, లక్ష్మీప్రియా, రిషిత, అక్షయ్, అభిషేక్, సాత్విక్ నందన్, రజినీకాంత్ భవాని, వాసికర్, శ్రీ హర్షిత్, నేత్ర, శ్రీ వికసిని, స్మితేష్, శ్రీ హరిషిని, భార్గవరామ, అశ్విత్ రెడ్డి, శైలేందర్, దీపిక దుర్గ, సాత్విక్, శ్రీనందన్, శ్రీ సిద్ధ్విక్, అధ్య, శాన్వి శ్రీ, అక్షిత తదితరులు ఈ రికార్డు సాధనలో పాల్గొన్నారు.రికార్డు సాధించిన విద్యార్థులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తల్లిదండ్రులు అభినందించారు.

# ఎండా కాలం దృశ్య ఉపాధి కూలీలకు టెంటు సామాగ్రి అందజేసిన సర్పంచ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమై ఉన్న కూలీల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని జులపల్లి గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ మానవత్వాన్ని చాటుకున్నారు. కూలీలు పని చేసే ప్రదేశం వద్ద వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, దాహార్తిని తీర్చేందుకు స్వయంగా వాటర్ బాటిళ్లను మరియు ఎండ నుండి ఉపశమనం పొందేందుకు అవసరమైన పడాలను నీడనిచ్చే షెడ్లను పంపిణీ చేశారు. అలాగే, డీహైడ్రేషన్ బారిన పడకుండా వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎండలో పనిచేసేటప్పుడు తగినంత నీరు తాగుతూ, నీడలో సేదతీరాలని.సూచించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్‌తో పాటు ఉప సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్, మరియు ఎస్. శ్రీను, బాలకృష్ణ,శ్రీను, యాదయ్య, ఉపాధి హామీ పనుల నిర్వాహకులు రాములు మరియు కూలీలు తదితరులు పాల్గొన్నారు

# పిల్లల భద్రతపై దృష్టి చైల్డ్ సేఫ్టీ వీక్ కార్యక్రమం నిర్వహణ

**వెల్జాల్ గ్రామ అంగన్ వాడి సూపర్వైజర్ తిరుమల**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో 99 యాక్షన్ ప్లాన్ లో భాగంగా చైల్డ్ సేఫ్టీ వీక్ అవగాహన ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్స్ నస్రీన్ బేగం, భూషణమ్మ , ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వానారాశి రాములమ్మ, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్ సీసీ శ్రీశైలం, పల్లెదవఖాన డాక్టర్ సంధ్య గ్రామ పంచాయతీ సెక్రెటరీ శరత్, హాజరయ్యారు. ఈ సందర్భంగా సుప్రవైజర్ తిరుమల మాట్లాడుతూ పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలిపారు. చిన్నారులపై జరిగే అనర్థాలను ముందుగానే నివారించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల రక్షణ కోసం ప్రతి ఇంట్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ..ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో తరచూ నిర్వహించడం ద్వారా పిల్లలపై జరిగే అఘాయిత్యాలను తగ్గించవచ్చని తెలిపారు. అంగన్వాడి టీచర్లు నస్రీన్ బేగం, భూషణమ్మ మాట్లాడుతూ చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా వివిధ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, పోస్టర్ ప్రచారాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.పల్లెదవఖాన డాక్టర్ సంధ్య మాట్లాడుతూ కిశోర బాలికల భద్రత, ఆరోగ్యం, భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా టీనేజ్ దశలో ఎదురయ్యే సవాళ్లను గుర్తించి, వాటిని ఎలా సమర్థంగా ఎదుర్కోవాలో వివరించారు.

టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలు, భవిష్యత్తుపై పడే ప్రభావం గురించి స్పష్టంగా తెలియజేశారు. భావోద్వేగాలకు లోనవకుండా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని బాలికలకు సూచించారు.మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు టీనేజ్ వయసులో సాధారణమేనని, అయితే వాటిని ఒంటరిగా భరించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలతో పంచుకోవడం ద్వారా పరిష్కారం కనుగొనవచ్చని తెలిపారు. చదువు మానేయడం భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ఏ పరిస్థితుల్లోనూ విద్యను కొనసాగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఇక సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సి.సి.శ్రీశైలం మాట్లాడుతూ అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని హెచ్చరించారు. మీ శరీరం మీదే మీ హక్కు అనే భావనను బలంగా నూరిపోస్తూ, ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే ప్రతిఘటించి, పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా బాలికల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం సమాజంలో సురక్షిత వాతావరణం ఏర్పడాలంటే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. కిశోర బాలికలకు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రతిజ్ఞ చేపట్టారు.ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు శ్రీరాములు, శేఖర్ ,నాయకులు వెంకటేష్ , అంగన్వాడీ టీచర్లు విజయ, హంసకల , ఆశ వర్కర్లు సరస్వతి కవిత మాధవి, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



# మే డే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి




**సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ అధ్యక్షతన మేడే సన్నాహక సమావేశం జరిగినది. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణంలోనీ సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని మేడే ఉత్సవాల్లో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ప్రధానంగా 140 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినాల కోసం జరిగిన మహోత్తర పోరాటం వల్ల కార్మికులు అనేక హక్కులు చట్టాలు సాధించుకున్నప్పటికీ నేటి పాలకులు కార్మిక చట్టాలకు హక్కులకు భంగం కలిగించే చర్యలు చేపడుతున్నారని వాటిని రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ముందుకు రావాల్సిన అవసరం ఉందని యూనియన్లు ఉన్నా లేకున్నా కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటంలో యూనియన్లతో నిమిత్తం లేకుండా ప్రతి కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హమాలీ సంఘం ,భవన నిర్మాణ కార్మిక సంఘం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వివిధ సంఘాల నాయకులు ఎన్ బాలయ్య శ్రీశైలం రాజు గౌడ్ యాదయ్య చంద్రయ్య పర్వతాలు రమేష్ రజసంగం జిల్లా ఉపాధ్యక్షులు చిలుక బాల్రెడ్డి సిపిఎం నాయకులు ఏపీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

**ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం ప్రారంభించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణ కేంద్రంలో నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు నింపుతూ,ప్రతిభకు దిశా నిర్దేశం చేస్తూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నాల్గవ ఉచిత ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

చేతుల మీదుగా ఘనంగా జరిగింది,ఈ సందర్భంగా

సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ,నేటి నిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం అని గ్రామాల్లో ప్రతిభ ఉంది కానీ అవకాశాలు కొరత కూడా ఉంది,ఆ అవకాశాల కొరతను భర్తీ చేయడానికే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం అని, మీరు నేడు ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు,కానీ రేపు మిమ్మల్ని అధికారులుగా మలోచేందుకే ఈ ప్రయత్నం అని,మన గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా ఎదుర్కొన్న వ్యక్తిగా మీలో ఒకడిగా ఆలోచించి,

పట్టుదల ఉన్న యువతకు పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ప్రతి మండల కేంద్రంలో గ్రామీణ అందుబాటులో ఉచిత శిక్షణ తరగతులుప్రారంభిస్తున్నామని,ప్రభుత్వ ఉద్యోగం ఒక నియామకం మాత్రమే కాదని,అది కుటుంబ గౌరవం, సమాజంలో గుర్తింపు,సేవా బాధ్యత అని పేర్కొన్నారు,ఉచిత శిక్షణ కేంద్రాల ఏర్పాటుతో పాటు అవసరమైన వసతులు అందిస్తూ గ్రామీణ నిరుద్యోగ యువతకు మరింత అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ.గ్రామీణ యువతకు అందుబాటులో అవకాశాల వేదికలను సృష్టిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కృషి అభినందనీయం, సుంకిరెడ్డి చేపడుతున్న ఈ కార్యక్రమం కేవలం శిక్షణ కేంద్రం మాత్రమే కాదు,గ్రామీణ యువత జీవితాలను మార్చే గొప్ప కార్యక్రమంగా కొనియాడారు, ఫీజులు కట్టలేక కలలు వదులుకునే పేదింటి విద్యార్థులు ఇలాంటి ఉచిత శిక్షణ కేంద్రాలు భవిష్యత్ ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయని, చాలామంది అవకాశాల లేమితో వెనకబడుతున్నారు, ఇలాంటి కార్యక్రమాలు వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాయి, సుంకిరెడ్డి సేవా దృక్పథం రాజకీయాలకు అతీతమని, యువత భవిష్యత్తుపై బాధ్యతతో చేస్తున్న కృషి నిజంగా అభినందనీయం అని పేర్కొంటూ,ఈ శిక్షణ కేంద్రం నుంచి పెద్ద ఎత్తున భవిష్యత్ పోలీస్ అధికారులు రావాలి అదే ఈ కార్యక్రమానికి నిజమైన గౌరవం ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు.శిక్షణ కేంద్రంలో చేరిన విద్యార్థులు మాట్లాడుతూ,తమలాంటి గ్రామీణ నిరుద్యోగ యువతకు ఇది గొప్ప అవకాశం అని,మా పరిస్థితుల్లో కోచింగ్ అనేది మాకు చాలా ఖర్చుతో కూడుకున్న పరిస్థితి అని,ఇలాంటి పరిస్థితుల్లో మాకు సుంకిరెడ్డి సహకారంతో గొప్ప అవకాశం లభించింది అని,ఉద్యోగం సాధించి ఈ నమ్మకాన్ని నిలబెడతాం అంటూ,సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసున్న , జె ఎ సి చైర్మన్ సదానందం గౌడ్ సీనియర్ పాత్రికేయులు ప్రహ్లాద్, పరిపూర్ణం, శ్రుతిలయ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్తో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# కటింగ్ లేకుండా కొనుగోలు

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు...**
**రైతు సమస్యలపై రాజీ పడే ప్రసక్తి లేదు...**
**ప్రతి గింజ కొనుగోలు చేస్తాం...**
**కొనుగోలు జరిపిన వెంటనే ఖాతాలోకి డబ్బులు జమ...**

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

మంగళవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు సెంటర్లను మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు,కూరమపల్లి, అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్, గౌరెడ్డిపేట,ముత్తారం, హన్మం తునిపేట, చీకురాయి గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులుచింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు ... పెద్దపల్లి మండలం,రంగాపూర్ గ్రామంలో 30 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను అందించారు





**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుండి కటింగుల పేరిట కొనుగోలు సెంటర్లలో ధాన్యంను నిలువు దోపిడి చేశారని అన్నారు. ఆరుగాలం కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చి రైతులు పండించిన పంటలను కటింగుల పేరిట బిఆర్ఎస్ పెద్దలు దోచుకు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులకు సంపూర్ణ మైన నమ్మకం విశ్వాసం తనపై ఉందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క రైతు తనను రైతుబిడ్డగా చూడటం సంతోషంగా ఉందన్నారు. రైతుల విశ్వాసం పూర్తిగా చూరగొనడం తన అదృష్టమన్నారు. అయితే రైతు సమస్యలను పరిష్కరించడంలో తన కష్టాన్ని కూడా గుర్తించాలని ఆయన ప్రజలను కోరారు. కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్ నుండి ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. సన్న వడ్లకు బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు భరోసా విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. విడతల వారిగా రైతు భరోసా ను ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. అలాగే సెంటర్లలో కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో రోజుల తరబడి డబ్బుల కోసం రైతులు పడిగాపులు కాశారని అన్నారు. రైతులు తరచూ వరి పంట కాకుండా పంటల మార్పిడి పై శ్రద్ధ చూపాలని కోరారు. సేంద్రియ ఎరువులను వాడితే భూసారం పెరుగుతుందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంటింటికి ఇసుకను సులభతరం చేసిన ఘనత కూడా తమదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు అహోరాత్రులు కష్టపడుతున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ, శ్రీనివాస్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, నూగిల్ల మల్లయ్య, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ కూర మల్లారెడ్డి సంతోష్,కట్కూరి సుధాకర్ రెడ్డి,బండారు రామూర్తి,గుజ్జుల కుమార్, గంట రమేష్,,సందవేనా రాజేందర్,అర్కూటీ సంతోష్, ప్రమేష్, విజయ్,ఆయా గ్రామలా సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు,నాయకులు విజయ్, కుమార్, రాయాలింగు, అంజయ్య సంతోష్, అభిలాష్, కుమార్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# మౌనిక మృతి పట్ల దిగ్భ్రాంతి
# కుటుంబానికి అండగా నిలిచిన హెల్పింగ్ హాండ్స్

అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన జంగపల్లి లక్ష్మి--ఆశాలు చిన్న కుమార్తె జంగపల్లి మౌనిక (18) హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందడం స్థానికంగా విషాదాన్ని నెలకొల్పింది. యువతీ అకాల మరణం గ్రామ ప్రజలను తీవ్రంగా కలిచివేసింది.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు హెల్పింగ్ హాండ్స్ సంస్థ ముందుకు వచ్చి మానవతా సేవను చాటింది. సంస్థ అధ్యక్షుడు నారగోని సతీష్ నేతృత్వంలో సభ్యులు రూ.1,01,100 ఆర్థిక సహాయాన్ని సేకరించి, మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్, సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మల్యాల రాంచంద్రం గౌడ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలిచి, వైద్య సహాయం అవసరమైన వారికి అండగా నిలుస్తూ సమాజంలో మానవతా విలువలను పెంపొందించే దిశగా కృషి చేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సేవలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు.సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. హెల్పింగ్ హాండ్స్ చేసిన ఈ సహాయం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.అలాగే ఎస్ఐ కొట్టే ప్రసాద్ మాట్లాడుతూ, మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి



ఎంతో అవసరమని, ఇలాంటి సేవా సంస్థలు మరింత ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్యాల విజయ్ గౌడ్, మహమ్మద్ జావీద్, దయ్యాల రాజు, గరిగంటి విష్ణు, నల్లవెల్లి ఈశ్వర్, సయ్యద్ నజీబ్, జంగపెల్లి సది, అజయ్, అనిల్,యశ్వంత్, రాకేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మౌనిక కుటుంబానికి సహాయం చేసిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులకు అధ్యక్షులు నారగోని సతీష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# చంపాపేట లో ఎంపి ఈటల పర్యటన

**హైదరాబాద్** చంపాపేట్ డివిజన్ లో కాలనీ సమస్యలను పరిశీలించి, పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ సాయి నగర్ మద్దెల చెరువు ఒక మురికి కూపం లాగా ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న డ్రైనేజ్ అంత ఇక్కడే నిల్వ ఉండి, ఈగలు, కంపు వాసన, చుట్టుపక్కల ఎక్కడ బోరు వేసినా పొల్యూటెడ్ వాటర్ తో సతమతమవుతున్నారాని దివంగత నేత వంగ మధు గారు మంచినీళ్ల చెరువుగా చేయాలని ప్రయత్నం చేసి కోటి రూపాయలతో డ్రైనేజీ పైప్ లైన్ వేయించారు. కానీ శుభ్రపరిచే వాళ్ళు లేక పైపు కెపాసిటీ సరిపోక ఎక్స్ట్రా ఆయన నీరంతా కూడా చెరువులోకి పోయి మళ్ళీ మురికి కూపం లాగా మిగిలిపోయింది. దీని ప్రక్షాళన కోసం మురికి నీరు చెరువులోకి రాకుండా ఉండటం కోసం, అవసరమైతే ఇంకో పైప్లైన్ వేసి దాని కెపాసిటీ పెంచుతామని అన్నారు. చెరువు దగ్గర జులాయిల, పోకిరిల అడ్డాగా మారిపోయింది. ఇది మాదకద్రవ్యాలకు అడ్డాగా కాకుండా ఉండాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాము. చెరువు చుట్టూ ఫెంక్షన్ కూడా వేయించాలని కోరారు. దానిపై నేను అధికారులతో మాట్లాడి వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నాను. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే రాజకీయాల, ఫోటోల, ఆధిపత్యం కోసం పాకులాడే వాళ్ళని చూస్తున్నాం. ప్రజలకు ఎవరు ఏం చేస్తారో గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు నా దగ్గరకు వచ్చి కంప్లైంట్ చేస్తే నేను పరిశీలిస్తానని చెప్పాను ఇప్పుడు వచ్చి పరిశీలిస్తున్నాను. దీనికి ఏమేమి పనులు పెండింగ్ ఉన్నాయో అవన్నీ చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు. హైదరాబాదులో ఎక్కడ చూసినా ఏదో ఒక మూలన పైప్ లైన్ కోసం తవ్వుతూనే ఉంటారు. వేగంగా పెరుగుతున్న



సిటీకి అనుగుణంగా పైప్లైన్ కెపాసిటీ ఉండాలి. మెగా ఫంక్షన్ హాల్ దగ్గర దివంగత నేత వంగ మధు గారి ప్రోత్బలం, నేను లెటర్ పెట్టి 6 కోట్ల రూపాయలతో కొత్త బాక్స్ డ్రైనేజీ కట్టడం జరుగుతుంది. దాన్ని కూడా అధికారులతో మాట్లాడి సకాలంలో పూర్తయ్యే ప్రయత్నం చేస్తాను. కార్పొరేటర్ల కాల పరిమితి అయిపోతున్నప్పుడే చెప్పినం... ఎంతోమంది కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యలో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవడం కష్టం ఉంది వారంతా దిగిపోయారు కాబట్టి మీరు స్పెషల్ ఆఫీసర్లు గంట, రెండు గంటలు గాని ఈ ప్రాంతంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలి కానీ ఎక్కడ జరుగుతున్నట్టు కనిపించడం లేదు. మాలాంటివారు ఈ ప్రాంతాల్లో తిరిగి ఈ పనుల పర్యవేక్షణ చేసి, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పై తప్పకుండా దృష్టి పెడతామని అన్నారు.

## ఇంచార్జ్ గా ఉప్పల వెంకటేష్ నీ నియమించాలి

**బీఆర్ఎస్ నాయకులు అల్లుడు కృష్ణ**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జిగా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ ను నియమించాలని బీ ఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు అల్లుడు కృష్ణ ప్రకటనలో కోరారు. ప్రజా నాయకుడు ఉప్పల వెంకటేష్ కార్యకర్తలను కష్టకాలంలో కాపాడుకుంటూ తన ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు ఇండ్లు కట్టిస్తూ పేద విద్యార్థులను చదివిస్తూ, చనిపోయిన కుటుంబాలను అందుకుంటూ పార్టీని అన్ని విధాలుగా ముందుకు నడిపిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసే నాయకుడు అని కొనియాడారు. నియోజక వర్గంలోని నాయకులు కార్యకర్తలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లగల సత్తా ఒక నాయకుడు ఉప్పల వెంకటేష్ కే సాధ్యమని బీ ఆర్ఎస్ అధిష్టానం వెంటనే స్పందించి ఉప్పల వెంకటేష్ ని కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జిగా నియమించాలని ఈ సందర్భంగా కోరారు.

## శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండలం చెర్కూర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులకు 5,00,000 ఐదు లక్షల రూపాయలు విరాళం అందజేసిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న పురాతన ఆలయాల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.అనంతరం వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, గోలి రాజేందర్ రెడ్డి, గోలి విష్ణువర్ధన్ రెడ్డి, అల్లె సందీప్ గంగపుత్ర , కేశమోని రామచంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలశీ లోని లింగరావుపల్లి గ్రామ పంచాయతీ కి చెందిన బక్కి అంజమ్మ భర్త అంజయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం జరిగింది.స్థానిక బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుల ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ నీ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది వెంటనే స్పందించిన ఆయన ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి ఇటుక ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,మాజీ మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్ యాదయ్య పవన్ వంశీ తది తరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి...

**కొలిమిగుండ్ల ఏప్రిల్ 28** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి తిరుణాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రాయలసీమ స్థాయి క్రికెట్ పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు, కమిటీ సభ్యులు, బహుమతి ఇస్తున్న దాతలతో కలిసి ఘనంగా ప్రారంభించారు. శ్రీ లక్ష్మినరసింహస్వామి తిరుణాల సందర్భంగా క్రికెట్ పోటీలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని మూలే రామేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి,ఎద్దుల వెంకటేష్, డాక్టర్ కిరణ్ కుమార్, నరసింహులు, నాగ కుళాయి, రవికుమార్, చంద్ర, వెంకటరాముడు ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కౌలు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం

**మద్దికేర:** మద్దికేర మండలంలోని పరిధిలోని గల బసనేపల్లి,హంప రెవెన్యూ గ్రామాల్లో కౌలు రైతుల కార్డుపై మంగళవారం రోజున వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి రవి మాట్లాడుతూ కౌలు రైతు కార్డు పొందడం వలన సాగుదారులకు ప్రభుత్వం నుండి వచ్చే అన్ని ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలియజేశారు.ఈ కార్డుల వలన భూ యజమానులకు ఎటువంటి నష్టం వాటిల్లదని రైతులకు ఆయన భరోసా కల్పించారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పీఎండిఎస్ విధానంలో విత్తనాలను వెదజల్లుకోవడం వలన తొలకరిలో కురిసే వర్షాలకు పంటలు మొలకెత్తి రైతులకు కావలసిన మేత,భూమి భూసారం పెరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, కనుక రైతులందరూ వర్షభావ పరిస్థితులు ఎదుర్కొనే విధంగా తక్కువ తేమ అవసరం అయ్యే పంటలు మరియు రకాలు సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. వేసవిలో సాగుచేసిన పంటలను ఈ క్రాప్ లో నమోదు చేసుకోవాలని రైతులకు ఆయన తెలియజేశారు. అదేవిధంగా ఏపీ ఎఫ్ఆర్ రైతు రిజిస్ట్రీ సంఖ్య ప్రతి రైతు పొందాలని,దీని కొరకు స్థానిక రైతు సేవ కేంద్ర ఇన్చార్జిని సంప్రదించాలని రైతులకు తెలియజేశారు.




# గెటప్ రెడీ.. ఇక మిగిలింది యాక్షనే!

అగ్ర కథానాయకుడు చిరంజీవి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని చిరంజీవి పాత్రకు సంబంధించిన లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తయింది. ఇందులో మెగాస్టార్ పవర్‌ఫుల్, స్ట్రైకింగ్ లుక్‌లో కనిపిస్తారని లుక్ టెస్ట్‌ని బట్టి అర్థమవుతున్నది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ రెండో చిత్రం మెగా అభిమానులకు విందు భోజనంలా ఉంటుందని సమాచారం. మాస్ ఎంటర్‌టైనర్స్ తీయడంలో సిద్ధహస్తుడైన బాబీ ఈసారి మెగాస్టార్ కోసం ఇంటెన్స్ క్యారెక్టర్‌ని డిజైన్ చేశారని, మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్ మరింత ఎలివేట్ అయ్యేలా స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ముహూర్తం, రెగ్యులర్ షూటింగ్ వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటిస్తారు.



# అరుదైన గౌరవం



ప్రస్తుతం యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉంది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. కేరళలో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా త్వరలో రష్మిక మందన్న ఓ గ్లోబల్ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నది. జపాన్‌లోని టోక్యోలో జరగనున్న గ్లోబల్ యానిమే అవార్డ్స్ వేడుకలో రష్మిక మందన్న ప్రజెంటర్‌గా వ్యవహరించనుంది. ప్రపంచవ్యాప్తంగా యానిమేషన్ రంగంలో అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన సాంకేతిక నిపుణులతో పాటు సినిమాలకు గత పదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. భారత్ నుంచి ఈ ఏడాది గ్లోబల్ యానిమే వేడుకలో పాల్గొంటున్న ఏకైక భారతీయ నటి రష్మిక మందన్న కావడం విశేషం. ఇదొక అరుదైన గౌరవమని అంటున్నారు. అయితే 2024లో జరిగిన గ్లోబల్ యానిమే ఈవెంట్‌లో కూడా రష్మిక మందన్న పాల్గొన్నది. ఈ వేడుకలో భాగమైన తొలి భారతీయురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. మరోమారు రష్మిక మందన్న ఈ గ్లోబల్ ఈవెంట్‌లో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది.




# బాలీవుడ్‌లో మైథలాజికల్ జంగిల్ డ్రామా?

తమిళ అగ్ర కథానాయకుడు ధనుష్ హీరోగా బాలీవుడ్‌లో ఓ మైథాలాజికల్ జంగిల్ డ్రామా తెరకెక్కనున్నది. కోలీవుడ్ ఫిల్మ్ మేకర్ పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి బాలీవుడ్ అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాత. ఈ ప్రాజెక్ట్‌కు హీరోగా ముందు రామ్‌చరణ్‌ను అనుకున్నారట. కొన్ని కారణాల వల్ల చర్చలు కార్యరూపం దాల్చకపోవడంతో ఈ సినిమా ధనుష్ కాంపౌండ్‌కు చేరిందంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. ఓ పౌరాణిక గాథ ఆధారంగా అటవీ నేపథ్యంలో ఈ కథ సాగుతుందట. దర్శకుడు పీఎస్ మిత్రన్ తమిళంలో తెరకెక్కించిన ఇరుంబు తిరై, సర్దార్ చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో పాటు భన్సాలీతో ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా ఈ ప్రాజెక్ట్ మిత్రన్‌కి దక్కిందని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.

# పుట్టినరోజు కానుకగా...

హీరో ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా తన అభిమానులకు ఓ కానుక ఇవ్వనున్నారు. మే 20న ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన హీరోగా నటించిన 'ఊసరవెల్లి' సినిమా రీ రిలీజ్ కానుంది. ఎన్టీఆర్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఊసరవెల్లి'. తమన్నా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో తనికెళ్ల భరణి, ప్రకాశ్‌రాజ్, విద్యుత్ జమాల్, సాయాజీ షిండే, మురళీ శర్మ తదితరులు ఇతరపాత్రలు పోషించారు. బి. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా 2011 అక్టోబరు 6న రిలీజ్ అయింది. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్లస్‌గా నిలిచింది. కాగా 'ఊసరవెల్లి' చిత్రం సుమారు పదిహేనేళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. ఇక ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్). ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2027 జూన్ 11న రిలీజ్ కానుంది.





# కింగ్ 100.. 'శివ' లుక్‌తో నాగార్జున

టాలీవుడ్ కింగ్ నాగార్జున తన వందో సినిమాను ఎంతో ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పేదరికం నుంచి సంపన్నుడిగా ఎదిగిన ఫార్ములా కథతో సాగనుందని తెలుస్తోంది. ఇందులో నాగ్ ఒక షేడ్‌లో 25 ఏళ్ల యువకుడిలా కనిపించనున్నారని సమాచారం. దాని కోసం చిరంజీవి ఆచార్యలో, రజనీకాంత్ కూలీలో వాడిన అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారట. అంటే దాదాపు శివ సినిమాలో నాగార్జున ఎలా కనిపించారో, అదే వింటేజ్ లుక్‌ను ఈ పాత్రలో మళ్లీ చూపించనున్నారు. ఆచార్య వచ్చిన సమయంలో ఈ టెక్నాలజీ ఖరీదైనది. కానీ ఇప్పుడు ఏఐ అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గింది, దాంతో వాడకం చాలా సులభమైంది. ఇక దీంతో నాగార్జున వందో సినిమా మరింత ప్రత్యేకంగా మారే అవకాశం ఉంది. కాగా ఈ చిత్రంలో టబు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. నాగార్జున-టబు జంట 28 ఏళ్ల తర్వాత మళ్లీ తెరపై కనిపించనుంది. గతంలో వీరిద్దరూ నటించిన నిన్నే పెళ్ళాడతా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. చివరిగా వీరు ఆవిడా మా ఆవిడే చిత్రంలో నటించారు. ప్రస్తుతం టబు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 75 శాతం పూర్తయింది. దసరా తర్వాత విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. అయితే టైటిల్ నుంచి రిలీజ్ డేట్ వరకు ఏదీ ఇప్పట్లో ప్రకటించే ఉద్దేశం లేదు. సినిమా పూర్తయిన తర్వాతే ప్రచారం మొదలుపెట్టాలని నాగ్ నిర్ణయించారు. ఇలా నాగార్జున తన వందో చిత్రంపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టారు.



# 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్

సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోలీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com